జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ గురువారం 04, జులై 2024 ‖ ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

## ఏపీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష వాయిదా

అమరావతి,మహానాడు:
ఆంధ్రప్రదేశ్ గ్రూప్-2 అభ్యర్థులకు అలర్ట్.. తాజాగా ఏపీపీఎస్సీ కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. మెయిన్స్ పరీక్షను వాయిదా వేస్తూ ప్రకటన చేసింది. ఆంధ్రప్రదేశ్ గ్రూప్-2 అభ్యర్థులకు అలర్ట్.. ఈనెల 28న జరగాల్సిన మెయిన్స్ పరీక్షను వాయిదా వేస్తూ తాజాగా ఏపీపీఎస్సీ కమిషన్ కీలక ప్రకటన చేసింది. త్వరలో కొత్త తేదీలు ప్రకటించనున్నట్లు ఏపీపీఎస్సీ కమిషన్ వెల్లడించింది.








- చీమకుర్తిలోనూ ఆగని మైనింగ్ మెరుపులు
- ప్రకాశంలో వెలిగిపోతున్న వైసీపీ నేతల వ్యాపారాలు
- సర్కారు మారినా బేఫికర్‌గా బిజినెస్
- వైసీపీ జమానాలో టీడీపీ నేతల వ్యాపారాలకు వేధింపులు
- క్వారీ, మైనింగ్‌లను బలవంతంగా స్వాధీనం చేసుకున్న దాదాగిరి
- నాటి మంత్రికి వ్యాపారాల్లో వాటాలు
- ఇవ్వని వారి వ్యాపారాలకు అడ్డంకులు, విజిలెన్స్ వేధింపులు
- గొట్టిపాటి రవి వ్యాపారాలకూ కోట్ల నష్టం
- ఇప్పుడు టీడీపీ వచ్చినా వైసీపీ వ్యాపారాలకు బేఫికర్
- అడ్డేలేని అవినాష్‌రెడ్డి కుటుంబ వ్యాపారాలు
- టీడీపీ శ్రేణుల విస్మయం

### బల్లికురువలో దర్జాగా వెలిగిపోతున్న
# అవినాష్ క్వారీ బిజినెస్

(మార్తి సుబ్రహ్మణ్యం)
ప్రకాశం జిల్లా పేరు చెప్పగనే మొదట గుర్తుకొచ్చేది చీమకుర్తి. తర్వాత బలికురవ. ఎందుకంటే ఇక్కడే వేలకోట్ల రూపాయల మైనింగ్, క్వారీ వ్యాపారాలు జరుగు తుంటాయి. దొంగబిల్లులతో కోట్లకు పడగలెత్తిన బడాబాబుల సంఖ్య డజన్లపైనే ఉంటుంది. ఒకటే బిల్లుతో ఎగుమతి చేసే మైనింగ్ వ్యాపారంలో పోలీసు-విజిలెన్సు-అధికారపార్టీ-మీడియా.. అందరూ భాగస్వాములే. వీరి లోడు చేసే లారీలకు ఎక్కడా తనిఖీలుండవు.

అటు నెల్లూరు తడ వైపు.. ఇటు మాచర్ల వైపు వరకూ ఏ చెక్ పోస్టు దగ్గరా చెకింగ్ ఉండదు. చిన్న స్లిప్పు చూపిస్తే చాలు. వాటికి రాజప్రవేశమే. చదివింపులన్నీ ఇక్కడ పూర్త యిన తర్వాతే వాటికి పచ్చజెండా. కారణం.. మామూలే! ఇక పోర్టుల్లో అయితే చెప్పే పనేలేదు. టాక్సులు ఎలా ఎగ్గొట్టాలో వీరికి తెలిసినంతగా ఎవరికీ తెలియదు. ఎవరైనా విజిలెన్సు-పోలీసు అధికారి ఈ వ్యాపారాలపై కన్నేస్తే, వారిని తక్షణమే శంకరగిరి మాన్యాలు పట్టిస్తారు. అంత పవర్‌ఫుల్ లాబీ అది.

అలాంటి జిల్లాలో గత ఐదేళ్లు చక్రం తిప్పిన కడప వైసీపీ ఎంపి, మాజీ సీఎం జగన్ సోదరుడు అవినాష్‌రెడ్డి కుటుంబం హవా పార్టీ అధికారం కోల్పోయినా ఇంకా దేదీప్యమానంగా వెలగడమే తమ్ముళ్ల విస్మయానికి కారణం. ప్రకాశం జిల్లాలోని చీమకుర్తి, బల్లికురువ, మార్టూరు, గురిజేపల్లి, వేమవరం, సంతమాగులూరు గ్రామాలు మైనింగ్, క్వారీలకు ప్రసిద్ధి. ఇక్కడి క్వార్జ్, గెలాక్సీ, బ్లాక్‌స్టోన్ చైనాకు సైతం ఎగుమతి అవుతాయి. కొన్ని వేల కోట్ల రూపాయల టర్నోవర్ ఉన్న ఈ ప్రాంతాలు, రాజకీయ పార్టీలకు ప్రధాన ఆదాయ వనరన్నది బహిరంగ రహస్యం. ఇక్కడి మైనింగ్ జిల్లా అధికారి పోస్టింగ్ కోసం భారీ స్థాయిలో పైరవీలు జరుగుతుంటాయి.

ఏ పార్టీ అధికారంలో ఉంటే, విపక్షాల మైనింగ్ వ్యాపారాలపై దాడులు, వేధింపులు జరుగుతుండటం వైఎస్ జమానా నుంచి మొదలయింది. అప్పట్లో టీడీపీలో ఉన్న శిద్దా రాఘవరావు కుటుంబాన్ని వైఎస్ సర్కారు ఆర్థికంగా దెబ్బతీసింది. అక్కడ జిల్లా మంత్రులు, ఇన్చార్జి మంత్రులు ఎవరన్నా వారు నిమిత్తమాత్రులే. "పై స్థాయిలోనే మాట ముచ్చట" జరుగుతుంటుంది.

గురిజేపల్లి, బల్లికురవ, మార్టూరు, వేమవరం, సంత మాగులూరులో పెద్ద క్వారీలు ఉన్నాయి. మిగతా.. 2లో



## గనుల శాఖ ఫైళ్లు దహనం?

- కారులో వచ్చి కాల్చేసిన వైనం
- ఎమ్మెల్యే బోడె ఫిర్యాదు
- డ్రైవర్‌ను వెంబడించి పట్టుకున్న స్థానికులు
- సమీర్ శర్మ ఆదేశాలతో కాల్చేశామన్న డ్రైవర్

విజయవాడ:
పెదపులిపాక కరకట్ట వద్ద గనుల శాఖకు చెందిన ఫైళ్లను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేసిన ఘటన కలకలం రేపింది. మైనింగ్ శాఖకు చెందిన ఫైళ్లు, హార్డ్‌డిస్కులు, క్యాసెట్లు దగ్ధమయ్యాయి. వాటిని కాలుస్తుండగా గమనించిన స్థానికులు, మిగతా.. 2లో

### సీబీఐ కోర్టులో జగన్ కేసుల
## రోజువారీ విచారణ

- తెలంగాణ హైకోర్టు ఆదేశం



హైదరాబాద్:
ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. జగన్‌పై ఉన్న కేసుల గురించి దాఖలైన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. సీబీఐ కోర్టులో ఉన్న జగన్ కేసులను రోజువారీగా విచారించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. జగన్ కేసులపై గతంలో హరిరామ మిగతా.. 2లో



## ఏపీపీఎస్సీ చైర్మన్‌కు సవాంగ్ రాజీనామా

- ఏబీవీకి చాన్స్?

అమరావతి:
ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ పదవికి గౌతం సవాంగ్ రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామాను గవర్నర్‌కు సమర్పించడం, ఆయన వెంటనే ఆమోదించడం జరిగిపోయింది. విపక్ష నేతగా ఉన్న చంద్రబాబు బస్సుపై వైసీపీ కార్యకర్తలు రాళ్లేసినప్పుడు, ఆయన చేసిన వ్యాఖ్యలు విమర్శలకు గురయ్యాయి. ప్రతి ఒక్కరికి వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛ ఉంటుందని చేసిన వ్యాఖ్యపై విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

నిజానికి ఆయనకు చెక్ పెట్టేందుకు, సంస్థకు ఒక ఐపిఎస్‌ను కార్యదర్శిని నియమిస్తే బాగుంటుందన్న చర్చ పార్టీ వర్గాల్లో జరిగింది. టీడీపీ హయాంలో నియమించిన చైర్మన్‌ను.. మిగతా.. 2లో

- ఉపాధి కల్పన, సంపద సృష్టి..పేదరిక నిర్మూలనకు కేంద్రం
- అమరావతి విధ్వంసం జగన్ తెలుగుజాతికి చేసిన ద్రోహం
- విధ్వంస పాలనకు జగన్ ఒక కేస్ స్టడీ
- తెలంగాణకు హైదరాబాద్ లాగా...ఏపీకి అమరావతి సంపద కేంద్రం అయ్యేది
- ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నెరవేరుస్తాం...రాజధానిని పునర్నిర్మిస్తాం
- అమరావతిపై నమ్మకాన్ని మళ్లీ నిలబెడతాం..కేంద్ర సాయంతో ముందుకు సాగుతాం
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- రాజధాని అమరావతిపై శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం




# అమరావతి ప్రజా రాజధాని

అమరావతి,మహానాడు:
"అమరావతి రాజధానిని విధ్వంసం చేసి తెలుగుజాతికి జగన్ తీరని అన్యాయం చేశారు. దేశ చరిత్రలో జగన్ లాంటి వ్యక్తిత్వం ఉన్న వారు తప్ప ఇంకెవరూ రాజధాని మార్పు నిర్ణయాన్ని తీసుకోరు. విధ్వంసానికి జగన్ ఒక కేస్ స్టడీ. మాకు రాజధాని లేదు అని చెప్పుకునేంత పాపం రాష్ట్ర ప్రజలు ఏం చేశారు.? రాష్ట్రంలో పుష్కలంగా వనరులు ఉన్నాయి. తెలివి తేటలు గల మానవ వనరులు ఉన్నాయి. పెట్టుబడుల కోసం ప్రపంచం వ్యాప్తంగా ఇక్కడికి వచ్చే అవకాశం ఉంది. అలాంటి రాష్ట్రాన్ని ఐదేళ్ల పాటు విధ్వంసంతో నాశనం చేశారు" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. వెలగపూడి సచివాలయంలో రాజధాని అమరావతిపై బుధవారం శ్వేతపత్రం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...

### రాష్ట్ర నడిబొడ్డున అమరావతి రాజధాని

"రాష్ట్ర విభజన జరుగుతుందని, ఇక్కడ రాజధాని కట్టాల్సి వస్తుందని ఎవరూ అనుకోలేదు. రాజధానికి ఏ పేరు పెడితే బాగుంటుదని ఆలోచిస్తున్నప్పుడు రామోజీరావు ఎంతో పరిశీలన చేశాక చరిత్ర సృష్టిస్తుందని అమరావతి పేరును సూచించారు. దానికి రాష్ట్ర ప్రజలంతా కూడా హర్షం వ్యక్తం చేశారు. రాజధాని శంకుస్థాపనకు ప్రతి గ్రామం నుండి నీరు, మట్టి తెచ్చాం. మిగతా.. 2లో




## అందరికీ ఉచితంగా ఇసుక

- మూడు మాసాల్లో ఉచిత ఇసుక పాలసీని రూపొందిస్తాం
- నిర్మాణ రంగాన్ని పునరుద్ధరిస్తాం, అందరికీ ఉపాధికల్పిస్తాం
- రాష్ట్ర గనులు, భూగర్బవనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి, జులై 3:
రానున్న మూడు మాసాల్లో ఉచిత ఇసుక పాలసీని తీసుకువచ్చి ఉచితంగా ఇసుకను అందరికీ అందు బాటులో ఉంచుతామని రాష్ట్ర గనులు, భూగర్భ వన రులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్లో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని అమల్లోకి తేవడం ద్వారా నిర్మాణ మిగతా.. 2లో


రైతులకు మళ్లీ పాత పంటల బీమా
3లో


మిషన్ భగీరథపై గత ప్రకటనలు అబద్ధాలేనా?
3లో


అర్హులైన ప్రతీ రైతుకి రైతు భరోసా ఇవ్వాలి
3లో


ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ... ప్రతి సమస్యను ఆసాంతం వింటూ...
3లో


కనీసం తాగునీటి పరీక్షలూ జరపడం లేదు
4లో


3నెలల్లో 1.28 లక్షల గృహాలను పూర్తి చేయాలి
5లో


మొక్కల పెంపకంపై ఖచ్చితమైన ఆడిట్
6లో


టెట్, మెగా డీఎస్సీ గడువు పెంపు!
6లో

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 04, జులై 2024





## ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ...
# ప్రతి సమస్యను ఆసాంతం వింటూ...

- పిఠాపురంలో క్షేత్ర స్థాయి పర్యటనలకు శ్రీకారం చుట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- ప్రతి గ్రామంలో పర్యటిస్తా.. ప్రతి సమస్య పరిష్కరిస్తానని హామీ

**పిఠాపుర,మహానాడు:**

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన సొంత నియోజక వర్గంలో క్షేత్రస్థాయి పర్యటనలకు బుధవారం శ్రీకారం చుట్టారు. ప్రత్యక్షంగా నియోజకవర్గ ప్రజల సమస్యలు తెలుసు కోవడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉప్పాడ తీర ప్రాంత సమస్యను తెలుసుకునేందుకు అధికారులతో కలిసి వెళ్తూ మార్గమధ్యంలో గ్రామ గ్రామాన ప్రజలతో మమేకంఅయ్యారు. వారు చెప్పిన సమస్యలు విన్నారు. వినతులు స్వీకరించారు.

త్వరలో పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని ప్రతి గ్రామంలో పర్యటించి ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నిన్న మొన్నటి వరకు తనకు కేటాయించిన శాఖల పని తీరుపై ఉన్నత స్థాయి అధికారులతో వరుస సమీక్షల్లో అధ్యయనం చేసిన పవన్ కళ్యాణ్, ఇప్పుడు క్షేత్ర స్థాయి పరిశీలన మొదలుపెట్టారు. తనకు కేటాయించిన గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరాశాఖ పరిధిలో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, తాగు నీటి శుద్ధి ప్లాంటుల పని తీరుని స్వయంగా పరిశీంచారు.

ఉప్పాడ తీరానికి పవన్ కళ్యాణ్ వస్తున్నారన్న వార్త తెలియడంతో పిఠాపురం ఉప్పాడ మధ్య ఆయన్ని కలిసేందుకు, తమ సమస్యలు చెప్పుకొనేందుకు ప్రజలు రహదారుల వెంట బారులు తీరారు. పవన్ కళ్యాణ్ మార్గమధ్యంలో తన కోసం వేచి ఉన్న ప్రతి ఒక్కరి దగ్గర వాహనాన్ని ఆపి వారి వద్దకు వెళ్లి మరీ పలకరించారు. ప్రజలు తమ గ్రామాల్లో సమస్యలు చెప్పుకోగా వాటిని ఆసాంతం విని, వాటి పరిష్కారానికి భరోసా ఇచ్చారు.

త్వరలో పిఠాపురం నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.పిఠాపురం, నవకంద్రవాడ, వాకతిప్ప, యు.కొత్తపల్లి తదితర గ్రామాల్లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

శాసనసభ్యుడిగా గెలిచిన పవన్‌కళ్యాణ్‌ని అభినందించేందుకు వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరిస్తూ ధన్యవాదాలు తెలిపారు. వాకతిప్ప ఎస్సీ కాలనీ వాసులు తమ కాలనీ సందర్శించాలని కోరగా కాలనీలోనికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. తమ కాలనీకి తాగునీటి సమస్య ఉందని, నీరు కొనుక్కుని తాగాల్సి వస్తుందని అక్కడ నివసిస్తున్న ప్రజలు పవన్ కళ్యాణ్ ఎదుట వాపోయారు.

### నాగులాపల్లి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పరిశీలన

ఇక తన పరిధిలోని శాఖల క్షేత్ర స్థాయి పనితీరుపై అధ్యయనంలో భాగంగా పిఠాపురం నియోజకవర్గం, నాగులాపల్లి వద్ద సూరప్ప చెరువు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పవన్ కళ్యాణ్ పరిశీలించారు. 100 శాతం ప్రతి ఇంటికీ తాగునీరు అందించే లక్ష్యం దిశగా కార్యచరణలో భాగంగా ఆ స్టోరేజ్ ట్యాంకును సందర్శించారు.

నాబార్డు నిధులతో 22 ఎకరాల్లో ఉన్న ఈ ట్యాంకు, తాగునీటి శుద్ధి ప్లాంటు ద్వారా యు.కొత్తపల్లి మండల పరిధిలోని 54 గ్రామాలకు శుద్ధి చేసిన నీరు అందిస్తున్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు, తాగు నీటిని శుభ్రపరిచే విధానం, శుద్ధి చేసిన నీటిని నిల్వ ఉంచే ట్యాంకు, నీటి స్వచ్ఛత పరీక్షలు జరిపే పరిశోధనా కేంద్రాలను పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంఛార్జ్ ఎస్.ఈ. ఎన్.వి.వి. సత్యనారాయణ ట్యాంకు విస్తరణ అవసరాన్ని పవన్ కళ్యాణ్‌కి తెలిపారు.

పెరిగిన నీటి అవసరాలకు తగ్గట్టు ట్యాంకు విస్తరణకు రూ.12 కోట్ల మేర నిధులు అవసరం అవుతాయని, సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. జల్ జీవన్ మిషన్ నిధుల గురించి ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆరా తీశారు. కొండెవరం గ్రామ పరిసరాల్లో ఓ బాలుడు జనసేన జెండా ఊపుతూ అభివాదం చేస్తుంటే - కాన్వాయ్ నిలిపి ఆ బాలుడిని పలకరించారు. కాన్వాయ్ నిలిపి చిన్నారిని పలకరించడం గ్రామస్తులను అబ్బురపరచింది.

సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డిని మర్యదపూర్వకంగా కలసి "అసెంబ్లీ సాక్షిగా నా ప్రసంగాలు" పుస్తకాన్ని అందజేస్తున్న సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి



# అర్హులైన ప్రతీ రైతుకి రైతు భరోసా ఇవ్వాలి

- కమిటీలు, కమీషన్ల పేరు మీద కాలయాపన
- పాతబస్తీలో కరెంటు బిల్లులు వసూలు చేయడం ప్రభుత్వంతో అయితలేదా?
- రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటినయ్...చేతలు తంగేళ్లు దాటుతలేవు
- కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలను, మంత్రులను కలవలేదు
- బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు

**హైదరాబాద్,మహానాడు:**

తెలంగాణలో అధికారం కోసం గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా డిసెంబర్ 9వ తేదీన నుండి రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా ఇస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కేంద్ర నాయకత్వాన్ని కూడా రాష్ట్రానికి తీసుకొచ్చి వరంగల్ డిక్లరేషన్, రైతు డిక్లరేషన్, మహిళా డిక్లరేషన్ల పేరు మీద అనేక హామీలు ఇచ్చారు.

ఇచ్చిన హామీలకు కేసీఆర్ ప్రభుత్వం అవినీతి చేసిన లక్షల కోట్ల రూపాయలను వసూల్ చేసి హామీలు అమలు చేస్తామని చెప్పారు. నోటికి ఏది వస్తే అది మాట్లాడి అధికారంలోకి వచ్చి 7 నెలలు పూర్తవుతుంటే ఇప్పుడు కమిటీలు, కమీషన్ల పేరు మీద కాలయాపన చేస్తున్నారు. విత్తనాలు, ఎరువులు, పెట్టుబడులకు పైసలు లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ఉపముఖ్యమంత్రి నాయకత్వంలో ఒక కమిటీ వేసి విచారణ చేయాలని రేవంత్ రెడ్డికి ఇప్పుడు గుర్తుకు వచ్చిందా? రాహుల్ గాంధీ పార్లమెంటులో శంకరుడి ఫోటో పట్టుకొని అభయముద్ర, అభయహస్తం అని ముచ్చట చెప్పిండ్రు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన వరంగల్ రైతు డిక్లరేషన్ లోని అభయహస్తంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, ఎకరాకు రూ.15వేల రైతు భరోసా, కౌలు రైతులకు రూ.12వేలు, మూతపడిన చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించడం, పంటల భీమా, అన్ని పంటలకు మెరుగైన గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పారు.

రైతు కమీషన్, కొత్త వ్యవసాయ విధానం ఏర్పాటు చేస్తామని చెప్పిండ్రు. వరి పంటకు రూ.500 బోనస్ ఇస్తమని చెప్పిండ్రు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు వాళ్ళిచ్చిన ఎన్నికల మేనిఫెస్టో మీదనే గౌరవం లేదు. తొలుత రైతు రుణమాఫీ అని చెప్పిండ్రు. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రితో, ఇంకో నలుగురు మంత్రులతో కమిటీ వేసిండ్రు. అడ్డగోలుగా మాట్లాడి, హామీలిచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

ఆగస్టు 15 నుంచి 30లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామని చెప్పిండ్రు. వడ్డీ లేని రుణాలు అని చెప్పిండ్రు. 63లక్షల మంది మహిళలకు రూ.5లక్షల బీమా అన్నరు.ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు నెలలోగా అమలు చేస్తామని సీఎం రేవంత్




రెడ్డి చెప్పారు. ఏ నెలనో చెప్పలేదు.

పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి ఎక్కడికి పోతే అక్కడి దేవుడి మీద ఒట్టేసి అగస్టు 15లోగా రూ.2లక్షల రుణమాఫీ చేస్తా అని కొత్త మాట చెప్పిండు. అర్హులైన ప్రతీ రైతుకి రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటినయ్...చేతలు తంగేళ్లు దాటుతలేవు.

నిన్న ఖమ్మం జిల్లాలో ఒక రైతు తన భూమిని కొందరు కాంగ్రెస్ నాయకులు కబ్జా చేస్తున్నారని ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరం. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేలుకొని, తెలంగాణ రైతాంగాన్ని ఆదుకోవాలని భారతీయ జనతా పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాం. కేవలం అధికారంలోకి రావడానికే రేవంత్ రెడ్డి ఆగంఆగం నోటికొచ్చినట్లు మాట్లాడారు. ఓడదాటాక ఓడ మల్లన్న..ఓడ దాటినంక బోడ మల్లన్న అన్నట్లు రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదు...వెంటనే రాష్ట్ర రైతుల సమస్యలను పరిష్కరించాలి.

ఆంధ్రలో కలిసిన ఏడు మండలాల గురించి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏనాడు పట్టించుకోలేదు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలను, మంత్రులను కలవలేదు. నేటి ఫిరాయింపుదారులే రేపు ఫిరంగులై పేలుతరని కేసీఆర్‌కి గతంలోనే చెప్పిన పాత బస్తీల విద్యుత్ బకాయిలు వసూలు చేయడానికి టెండర్లను పిలిచి ఏజెన్సీలకు అప్పజెప్పడం మేం కాదనలేదు. మాట్లాడితే అంబానీ, అదానీ పేరు తప్ప ఇంకోటి రాదు.. పాతబస్తీలో కరెంటు బిల్లులు వసూలు చేయడం తెలంగాణ ప్రభుత్వంతో అయితలేదా? తెలంగాణ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు, ఆకాంక్షలు నిలబెట్టడానికి భారతీయ జనతా పార్టీ ఎంపీలందరం కృషి చేస్తాం.



# రైతులకు మళ్లీ పాత పంటల బీమా

- ఐఏఎస్ అధికారులు పొలాలకు, రైతుల వద్దకు వెళ్లాలి
- రైతులకు భరోసా కల్పించాలి
- గత ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణను గాలికి వదిలేసింది
- మళ్లీ వ్యవస్థలు గాడిన పడాలి
- ప్రభుత్వ సాయం, సబ్సిడీలతో రైతుల సాగు ఖర్చులు తగ్గించాలి
- ఖరీఫ్ సాగు ప్రణాళిక, సాగునీటి విడుదల పై సీఎం చంద్రబాబు నాయుడు రివ్యూ
- వ్యవసాయం, జలవనరుల శాఖలపై సీఎం సమీక్ష
- సాగునీటి విడుదల షెడ్యూల్‌ను ముఖ్యమంత్రికి వివరించిన అధికారులు

**అమరావతి,మహానాడు:**

రాష్ట్రంలో ఖరీఫ్ పంటల సాగులో వ్యవసాయ శాఖ సన్నద్ధతపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్షించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగు, పంటలకు నీటి విడుదల అంశాలపై అగ్రికల్చర్, ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి వనరులను సక్రమంగా నిర్వహించి సాగునీటి కొరత అనేది లేకుండా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశించారు.

సమీక్షలో అధికారులు సాగునీటి విడుదల ప్రణాళికను ముఖ్యమంత్రికి వివరించారు. గోదావరి డెల్టాకు జూన 1 నీరు విడుదల చేశామని...ఈ రోజు పట్టిసీమ, పుష్కర, తాటిపూడి, పురుషోత్తం పట్నం ద్వారా నీటి విడుదల మొదలుపెట్టినట్లు తెలిపారు. పులిచింతలలో నీటి లభ్యత లేదని....పట్టిసీమ ద్వారా వచ్చే నీటి ద్వారానే కృష్ణా డెల్టాకు సాగునీరు ఇస్తామని తెలిపారు.

ఈ సీజన్‌లో వర్షాలు బాగున్నాయని జూన్ నెలలో హీట్ వేవ్ ఉన్నా.. ప్రస్తుతం వర్షాలు ఆశించిన స్థాయిలో ఉన్నాయని చెప్పారు. 45 మండలాల్లో మాత్రమే వర్షపాతం లోటు ఉందని..రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే సరాసరి 50 శాతం అదనపు వర్షపాతం నమోదు అయ్యిందని వివరించారు. ఈ సీజన్ లో ఇప్పటి వరకు 4,14,490 లక్షల ఎకరాలు సాగు జరగాల్సి ఉండగా 3,04,604 ఎకరాల సాగు జరిగిందని తెలిపారు.

అనంతరం సిఎం చంద్రబాబు నాయుడు అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. గత 5 ఏళ్లలో ప్రభుత్వ విధానాల కారణంగా సాగు భారంగా మారిపోయిందని సిఎం అన్నారు. దేశంలో ఎక్కువ అప్పులు ఉండే రైతులు ఎవరంటే మన రైతన్నలే అనే పరిస్థితి వచ్చిందని సిఎం వ్యాఖ్యానించారు. ప్రభుత్వ సబ్సిడీలు, పాలసీల ద్వారా సాగుఖర్చులు తగ్గాలని సిఎం అన్నారు. గతంలో క్రమం తప్పకుండా సాయిల్ టెస్ట్‌లు నిర్వహించి, రైతులకు పోషకాలు అందించే వాళ్లమని అన్నారు.

అలాగే సీమ వంటి కరువు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున డ్రిప్ సబ్సిడీలు ఇచ్చామని..ఇలా రైతులకు మంచి చేసే అన్ని పథకాలను గత ప్రభుత్వం రద్దు చేసిందని సిఎం అన్నారు. ప్రాజెక్టుల నిర్వహణను గాలికి వదిలేశారని..కనీసం గేట్లకు గ్రీజు కూడా రాయలేదని అన్నారు. ఈ మొత్తం పరిస్థితి మారాలని,ప్రాజెక్టుల నిర్వహణ, నీటి నిర్వహణలో మళ్లీ ఉత్తమ విధానాలు అమలు చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు.

నాడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జీరో బడ్జెట్ నాచురల్ ఫార్మింగ్‌ను మూలనపడేశారని...మళ్లీ రైతులను ఆ దిశగా ప్రోత్సహించాలని సిఎం సూచించారు.డ్రోన్లతో పురుగు మందుల పిచికారీపై అధ్యయనం చేయాలని...రైతులకు వాటిపై అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే పంటలకు అధికంగా పురుగు మందులు కొట్టే విధానాలకు స్వస్తి పలకాలని....ఏ తెగులుకు ఏ మందు కొట్టాలి అనే విషయంలో అధికారులు రైతులకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

పంట కాలువల్లో 5 ఏళ్ల కాలంలో పూడిక కూడా తీయని దుస్థితి నెలకొందని, అన్ని పంట కాలువల్లో గుర్రపుడెక్క తొలగించాలని ఆదేశించారు. కృష్ణా నదీ నీటిని రాయలసీమకు ఎక్కువ ఉపయోగించి, వృధాగా పోయే గోదావరి వరద నీటిని సద్వినియోగం చేసుకుని కృష్ణా డెల్టాకు నీరు ఇవ్వాలని సిఎం అధికారులకు సూచించారు. మళ్లీ పాత విధానంలో క్రాప్ ఇన్స్యూరెన్స్ తీసుకురావాలని అధికారులకు సూచించారు.

రైతు భాగస్వామ్యంతో ఇక పంటల బీమా విధానం కొనసాగుతుందని చంద్రబాబు చెప్పారు. గత తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో ఆక్వాలో 29 శాతం గ్రోత్ తీసుకువస్తే... వైసీపీ ప్రభుత్వంలో అది 13 శాతానికి తగ్గిపోయిందని సిఎం అన్నారు. అలాగే హార్టికల్చర్‌లో 17 శాతం వృద్ధి ఉంటే...గత పాలకుల అసమర్థత వల్ల అది కూడా తగ్గిపోయిందని ముఖ్యమంత్రి అన్నారు. ఆక్వా, హార్టికల్చర్‌కు ప్రభుత్వంలో ఇక మరింత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. తీవ్ర నష్టాల్లో ఉన్న రైతులకు మళ్లీ భరోసా కల్పించేలా అధికారులు పనిచేయాలని సిఎం అన్నారు. ఐఏఎస్ అధికారులు సైతం సచివాలయం నుంచి పొలాలకు వెళ్లాలని, రైతులతో నేరుగా మాట్లాడాలని అన్నారు. అన్నదాతలకు అవసరం అయిన సూచనలు చేసి కొత్త సాగువిధానాలపై వారికి అవగాహన కల్పించాలని సిఎం సూచించారు. ఈ సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథపై గత ప్రకటనలు అబద్ధాలేనా?

- ఇంటింటి సర్వే నివేదికలు స్థానిక ఎమ్మెల్యేలకు ఇవ్వండి
- స్థానికంగానే తాగునీటి సోర్స్ ఏర్పాటు చేయండి
- మిషన్ భగీరథ కార్మికుల వేతనాలపై సమగ్ర నివేదిక ఇవ్వండి
- మిషన్ భగీరథ సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**హైదరాబాద్,మహానాడు:**

మిషన్ భగీరథ పథకం కింద 42 వేల కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలోని 1150 ఆవాసాలకు 50 శాతం నీళ్ళు సరఫరా చేస్తున్నామని చెబుతున్నారు. ఇదే పథకం కింద రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు తాగునీటి సరఫరా జరుగుతుందని, నీటి ఎద్దడి లేదని సర్పంచుల సంతకాలతో గతంలో అసెంబ్లీలో ప్రకటించారు. కేంద్రానికి నివేదిక పంపారు.. అంటే ఆనాటి ప్రకటన బోగస్ అని భావించాలా? అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను ప్రశ్నించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

రాష్ట్రంలో 23,824 ఆవాసాలు ఉండగా 1156 ఆవాసాల్లో 50 శాతం మాత్రమే నీళ్లు ఇవ్వగలుగుతున్నాం అంటున్నారు, ఆలేరు,భువనగిరి, నల్గొండ నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాలకు తాగునీరు అందడం లేదు. నిధులు కావాలని మీ శాఖ నుంచే ఫైల్ రావడం ఏంటని డిప్యూటీ సీఎం మిషన్ భగీరథ అధికారులను ప్రశ్నించారు. మిషన్ భగీరథ పథకం కింద తాగునీటి సరఫరా పై ప్రస్తుతం జరుగుతున్న సర్వే, అది ఎప్పుడు పూర్తవుతుంది తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

సర్వే పూర్తికాగానే రాష్ట్రంలోని అందరు ఎమ్మెల్యేలకు ఆ నివేదికలు అందజేసి... తాగునీరు అందుతుందన్న విషయాన్ని వారి ద్వారా నిర్ధారణ చేసుకోవాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. 42 వేల కోట్లు ఖర్చు చేసిన ఇంకా తాగునీటి ఎద్దడి ఉందని కొత్తగూడెం, ఆలేరు నియోజకవర్గాల్లో అదనపు నిధులు కోరుతున్నారు.. ఇదేంటని ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని మున్సిపాలిటీలకు హైదరాబాద్ మెట్రో నుంచి తాగునీటిని సరఫరా చేస్తుండగా, ఆయా మున్సిపాలిటీలు మిషన్ భగీరథ కింద మంచి నీటి సరఫరా చేస్తున్నట్టు రికార్డుల్లో ఎందుకు



చూపిస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు.

తాగునీటి సరఫరాకు ప్రధాన సోర్స్ ను వందల కిలోమీటర్ల నుంచి కాకుండా, సమీపంలో నుంచి తీసుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి తీసుకోవడం మూలంగా తరచూ పైప్‌లైన్‌లు పగిలిపోవడం వంటివి ఉత్పన్నమై, తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. మిషన్ భగీరథ పథకం కింద పనిచేస్తున్న సిబ్బంది జీవితాలు, నెలల తరబడి ఎందుకు పెండింగ్లో ఉంటున్నాయి అని ప్రశ్నించారు.

ఒక్కో ప్రాంతంలో ఒకరకంగా కార్మికుల వేతనాలు ఉంటున్నాయి, 8000 నుంచి 13 వేల వరకు అందుతున్నట్టు నాకు సమాచారం ఉంది. ప్రభుత్వం అందిస్తున్న వేతనాల నిధుల్లో ఎక్కువ మొత్తం ఏజెన్సీలు కట్ చేసుకుని, మిషన్ భగీరథ కార్మికులకు తక్కువ జీతాలు ఇస్తున్నారు దీనిపై సమీక్ష చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న వేతనాలు కార్మికులకు ప్రయోజనం చేకూర్చాల తప్ప, మధ్య ఏజెన్సీలకు కాదని అన్నారు. రాష్ట్రంలో మొత్తం ఉన్న ఏజెన్సీలు ఎన్ని, ప్రభుత్వం ఇస్తున్న వేతనాలు, ఏజెన్సీలు కార్మికులకు ఇస్తున్న వేతనాల వివరాల తో సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ కార్మికులకు, రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకంగా వేతనాలు ఉండేలా ఫిక్స్ చేయాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ పథకం కోసం చేసిన వేల కోట్ల అప్పు చెల్లిస్తున్న పథకం ప్రయోజనం పూర్తిస్థాయిలో నెరవేరడం లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కమాలు అన్నారు.

సమీక్ష సమావేశంలో స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు, పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, మెంబర్ సెక్రెటరీ టిఎస్ ఫైనాన్స్ కమిషన్ స్మిత సబర్వాల్, స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 04, జులై 2024

# వివేకా హత్య కేసులో కీలక సాక్షి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరం

- వైఎస్ వివేకా హత్య కేసులో కీలక సాక్షిగా ఉన్న వాచ్‌మెన్ రంగన్న
- గత కొంతకాలంగా శ్వాసకోస సమస్యతో ఇబ్బంది పడుతున్న రంగన్న
- ప్రస్తుతం పులివెందుల ఏరియా ఆసుపత్రిలో రంగన్నకు వైద్యం



పులివెందుల,మహానాడు:

కడప మాజీ పార్లమెంట్ సభ్యుడు వైఎస్ వివేకా హత్య కేసులో కీలక సాక్షిగా ఉన్న వాచ్‌మెన్ రంగన్న ఆరోగ్య పరిస్థితి ఆందోళన కరంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఆయన గత కొంతకాలంగా శ్వాసకోస సమస్యతో ఇబ్బంది పడుతున్నాడు. దీంతో రంగన్నను పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అతడిని కడప రిమ్స్‌కు రిఫర్ చేయడంతో అక్కడి తరలించడం జరిగింది.

కాగా, 2019 మార్చి 15న కడప జిల్లా పులివెందుల నివాసంలో వైఎస్ వివేకా దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. కేసును నమోదు చేసుకున్న పోలీసులు.. నిందితులను గుర్తించి జైలుకు పంపారు. వారిలో ప్రస్తుతం కొందరు బెయిల్‌పై బయటకు వచ్చారు. ఈ కేసులో నిందుతుల్లో ఒకరైన అవినాశ్ రెడ్డి కడప నుంచి వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేసి మరోసారి గెలుపొందారు. మరో నిందితుడైన దస్తగిరి అప్రూవర్‌గా మారారు.

# సచివాలయంలో మంత్రుల్ని కలిసిన ఎమ్మెల్యే అరవిందబాబు

## నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని వినతి




నరసరావుపేట, మహానాడు :


ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించిన అభివృద్ధి సంక్షేమాలను నియోజకవర్గంలో పక్కాగా అమలు చేయడమే తన ముందున్న తక్షణ కర్తవ్యమని నరసరావుపేట ఎమ్మెల్యే డా??చదలవాడ అరవింద బాబు అన్నారు.ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్,రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్,మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి.ఫరూఖ్,గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణిని కలిశారు. రాష్ట్రంలో మెరుగైన పాలన అందించే లక్ష్యంతో చంద్రబాబు నాయుడు ముందుకు అడుగులు వేస్తున్నారన్నారు.నియోజకవర్గంలో అభివృద్ధి విషయంలో ఎప్పుడూ సహాయ సహకారాలు అందించాలని విన్నవించారు.మంత్రులను కలిసిన వారిలో మీరావలి, వేల్పుల సింహాద్రి యాదవ్, చిన్నపరెడ్డి, బడే బాబు,మస్తాన్ షరీఫ్ పాల్గొన్నారు.



రాష్ట్ర విభజనానంతరం అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రికి విజ్ఞాపన పత్రం సమర్పించిన ఏపీ.గెజిటెడ్ అధికారుల సంఘం. ఈ నెల 6 తేదీన జరగబోవు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల ద్వైపాక్షిక సమావేశంలో వాటిని చర్చించాలని వినతి.



వైజాగ్ బీచ్ తీరాన సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



చంద్రబాబు అద్భుతమైన ఫోటో గీసిన చిత్రకారుడు తమిళనాడుకు చెందిన అర్పుతరాజ్.





# కాంగ్రెస్‌లో చేరిన కేకే

ఢిల్లీ,మహానాడు:

సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. కేశవరావుకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ లోకి ఆహ్వానించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి దీపాదాస్ మున్షీ, ఈ కార్య క్రమంలో పాల్గొన్నారు. కేకే కుమార్తె, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి గతంలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే.

# చంద్రబాబును కలిసిన రాష్ట్ర ఇంటిలిజెన్స్ చీఫ్ మహేష్‌చంద్ర లడ్హా

- రాష్ట్ర ఇంటిలిజెన్స్ చీఫ్‌గా మహేష్‌చంద్ర లడ్హా
- నక్సల్ ఆపరేషన్స్లో కీలకం వ్యవహారించిన లడ్హా



అమరావతి, మహానాడు :

రాష్ట్ర ఇంటిలిజెన్స్ చీఫ్‌గా మహేష్‌చంద్ర లడ్హాను ప్రభుత్వం నియమించింది. ఈ తరుణంలో సచివాలయంలో సీఎం చంద్రబాబును మహేష్‌చంద్ర లడ్హా మర్యాద పూర్వకంగా కలిశారు. 1998 బ్యాచ్‌కి చెందిన మహేష్చంద్ర లడ్హాకు శిక్షణ తర్వాత మొదటి పోస్టింగ్ను, మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన అప్పటి విశాఖ జిల్లా చింతపల్లిలో ఇచ్చారు. నక్సల్ సమస్యలు తీవ్రంగా ఉన్న సమయంలో ఏఎస్పీగా పనిచేశారు. అనంతరం మహబూబ్‌నగర్‌లో ఓఎస్డీగా పనిచేసిన లడ్హా కీలక నక్సల్ ఆపరేషన్స్ నిర్వ హించారు. 2004లో ఎస్పీగా ప్రకాశం జిల్లాలో ఆయనకు తొలి పోస్టింగ్ ఇచ్చారు.

గుత్తికొండ సహా ఇతర మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని గ్రామస్తులకు మహేష్చంద్ర లడ్హా అవగాహన కల్పిస్తూనే, పలు ఆపరేషన్లు చేపట్టారు. నక్సల్స్ ప్రభుత్వంతో చర్చలు జరపాలని నిర్ణయించినపుడు, ఎలాంటి అవాంఛ నీయ ఘటనలు జరగకుండా ఆయన కీలకంగా వ్యవహరిం చారు. 2005లో నక్సల్స్ ఆయణ్ని లక్ష్యంగా చేసుకుని దాడికి పథకం వేశారు. ఒంగోలు రహదారిపై వెళ్తుండగా సైకిల్ బాంబును పేల్చగా లడ్హా త్రుటిలో తప్పించుకున్నారు.

అనంతరం నిజామాబాద్ ఎస్పీగా మహేష్చంద్ర లడ్హా బదిలీ అయ్యారు. రేండేళ్ల తర్వాత గ్రేహౌండ్స్‌లో పనిచేశారు. 2009లో గుంటూరు ఎస్పీగా పనిచేసిన ఆయన అక్కడ రౌడీయిజంపై ఉక్కుపాదం మోపారు. గురజాల, పిడుగు రాళ్లలో ఫ్యాక్షనిజంపై చర్యలు తీసుకున్నారు. 2009 ఎన్నికల సమయంలో గుంటూరు జిల్లాలో రీపోలింగ్ జరగకుండా, గొడవలు చెలరేగకుండా చర్యలు తీసుకున్నారు. మొదటిసారి ఎలాంటి ఘర్షణలు జరగకుండా చర్యలు తీసుకున్నందుకు గానూ ఎన్నికల కమిషన్ ఆయణ్ని అభినందించింది.

హైదరాబాద్ ఈస్ట్ జోన్ డీసీపీగా పనిచేసిన తర్వాత మహేష్‌చంద్ర లడ్హా, కేంద్ర సర్వీసులకు వెళ్లి ఎన్ఐఏలో పనిచేశారు. మక్కా మసీదు పేలుళ్ల కేసు దర్యాప్తు సహా పలు ఉగ్రవాద కార్యకలాపాల కేసులు, హై ప్రొఫైల్ కేసులను దర్యాప్తు చేశారు. అనంతరం సీఆర్పీఎఫ్ సదరన్ సెక్టార్ ఐజీగా పనిచేశారు. అనంతరం విజయవాడ జాయింట్ సీపీగా విధులు నిర్వర్తించారు. కాల్ మనీ వ్యవహారంలోనూ ఆయన దర్యాప్తు చేశారు.

## విశాఖలో రౌడీలపై ఉక్కుపాదం

2018లో విశాఖ కమిషనర్‌గా పనిచేసిన మహేష్చంద్ర లడ్హా, అదే సమయంలో జగన్‌పై కోడికత్తితో దాడి జరిగిన వ్యవహారంలో పారదర్శకంగా దర్యాప్తు జరిపించారు. విశాఖలో రౌడీలపై ఉక్కుపాదం మోపారు. ఆయన చర్యలకు చాలా మంది రౌడీలు విశాఖ వదిలి వెళ్లిపోయారు. చెడ్డీ గ్యాంగ్‌ల భరతం పట్టారు. ఐపీఎస్ అధికారి లడ్హా తాను పనిచేసిన ప్రతి విభాగంలోనూ ప్రత్యేక గుర్తింపు తెచ్చు కున్నారు. సీఆర్పీఎఫ్లో విశిష్ట సేవలకుగాను ఈ ఏడాది ప్రెసిడెంట్ మెడల్ పురస్కారం దక్కింది. 2018లో విశాఖ సీపీగా పనిచేస్తున్న సమయంలోనూ ప్రెసిడెంట్ మెడల్ అందుకున్నారు. చేపట్టిన ప్రతీ పోస్టింగ్‌లోనూ సమర్థతతో వ్యవహరించిన మహేష్‌చంద్ర లడ్హా రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్‌గానూ కీలక భూమిక పోషించనున్నారు.

# స్కూటీపై ఎమ్మెల్యే సిటీటూర్



గుంటూరు, మహానాడు :

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గళ్ళా మాధవి తన నియోజక వర్గంలోని ప్రజా సమస్య లను స్వయంగా తెలుసుకునేందుకు డివిజన్ పర్యటనకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఉదయం 6.00 గంటలకే 18వ డివిజన్‌లోని రామనామ క్షేత్రం, శ్రీనివాసరావు పేట,వెంగళ్ శెట్టి వారి వీధి, అడపా బజార్, మొహిద్దీన్ పాలెం, వడ్డే గూడెం వంటి ప్రాంతాలలో పర్యటించారు. ఆమె స్వయంగా ద్విచక్ర వాహనం నడుపుతూ, డివిజన్ లోని ప్రధాన వీధులతో పాటు, సందులలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.. 18 డివిజన్‌లో ప్రధానంగా తనకు డ్రైనేజి, రోడ్లు, వీధి దీపాలు, మంచి నీటి పైపుల లీకులు వంటి ప్రజాసమస్యలు తన దృష్టికి వచ్చా యని, క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు తానే స్వయంగా వచ్చినట్లు పేర్కొన్నారు. వర్షాకాలం దృష్ట్యా ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని శానిటరీ ఇన్స్పెక్టర్, వాటర్ ఏఈ, సంబంధిత అధికారులను ఆదేశించారు.

# కనీసం తాగునీటి పరీక్షలూ జరపడం లేదు

- ప్రజారోగ్యంపై వైద్య ఆరోగ్య, మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- కలుషిత తాగునీరు, పారిశుధ్య లోపం, దోమల వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు
- అన్ని చోట్లా వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి
- సురక్షితమైన తాగునీరు, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి
- గ్రామాల్లో మళ్లీ వాటర్ హెడ్ ట్యాంకుల క్లీనింగ్, క్లోరినేషన్ పనులు చేయండి
- సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకున్న చర్యలపై మూడు శాఖలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష

అమరావతి,మహానాడు:

రాష్ట్రంలో వ్యవస్థలన్నీ గాడి తప్పాయని, 5 ఏళ్ల విధ్వం సానికి ప్రజలు బలవుతున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సీజనల్ వ్యాధులపై సచి వాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు.

వైద్య ఆరోగ్య శాఖతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు. సీజనల్ వ్యాధుల విషయంలో ముందు నుంచే అధికారులు చర్యలు తీసుకోవాలని, ఇప్పుడు చర్యలకు దిగితే పూర్తి ఫలితాలు రావని సీఎం అన్నారు. ఆయా శాఖల్లో 2014 నుంచి 2019 వరకు నాటి టీడీపీ పాలనలో అనుసరించిన ఉత్తమ విధానాలు (బెస్ట్ ప్రాక్టీసెస్) అన్నీ మళ్లీ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.



సచివాలయంలో బుధవారం జరిగిన సమీక్షలో సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకున్న చర్యలపై అధికారులు సీఎంకు వివరించారు. మలేరియా, డెంగ్యూ నివారణకు కార్యాచరణ అమలు చేస్తున్నామని, ఫీవర్ కేసులు ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తున్నామని, హైరిస్క్ కేసులపై ప్రత్యేక ఫోకస్ పెట్టామని అధికారులు వివరించారు. డెంగ్యూ, చికెన్ గున్యాకు ర్యాపిడ్ టెస్ట్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉందని అన్నారు.

ఈ సీజన్ లో ఇప్పటి వరకు రాష్ట్రంలో 60 డయారియా కేసులు నమోదయ్యాయని. ప్రస్తుతం 6 గ్రామాల్లో 35 డయేరియా యాక్టివ్ కేసులు ఉన్నాయని అన్నారు. ఈ సీజన్ లో 9 మంది డయేరియాతో చనిపోయారని వివరించారు. కలుషిత తాగునీరు వల్లే వీరంతా డయేరియా బారిన పడి చనిపోయారని అధికారులు వివరించారు.

అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.... గ్రామాలు, పట్టణాల్లో కలుషిత తాగునీరు, పారిశుధ్య లోపం, దోమల నివారణకు చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, వాటిపై ఇప్పటికే తగు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిందని సీఎం అభిప్రాయపడ్డారు.

సురక్షితమైన తాగునీరు, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల బారిన పడే వారి సంఖ్య అధికంగా ఉంటుందని, వారిపై వైద్య, ఆరోగ్య శాఖ మరింత దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. అన్ని చోట్లా వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని, కనీసం తాగునీటి పరీక్షలూ జరపడం లేదని సీఎం వ్యాఖ్యానించారు. నాటి తెలుగుదేశం ప్రభుత్వంలో గ్రామాల్లో వాటర్ హెడ్ ట్యాంకుల క్లీనింగ్, క్లోరినేషన్ పనులు పక్కాగా జరిగేవని, నేడు మళ్లీ నాటి బెస్ట్ ప్రాక్టీసెస్ పునరుద్ధరించాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు.

అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడితే మాత్రం ఉపేక్షించేది లేదని సీఎం హెచ్చరించారు. డెంగ్యూ వస్తే వైద్యానికి లక్షల్లో ఖర్చు అవ్వడంతో పాటు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, వారి జీవితాలు తల్లకిందులు అవుతున్నాయని సిఎం అన్నారు.

ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. వాటర్ క్వాలిటీ చెకింగ్ ల్యాబ్ కు కేవలం రూ.14 లక్షలు చెల్లించకపోవడంతో సేవలు నిలిచిపోయాయని, విషయం తెలిసి ఇప్పుడు బకాయిలు చెల్లించి సేవలు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. సీజనల్ వ్యాధుల నివారణలో మూడు శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అప్పుడే ఫలితాలు వస్తాయని సీఎం సూచించారు.

మూడు శాఖల మంత్రులు, అధికారులు దీనిపై ప్రత్యే కంగా సమావేశం పెట్టుకుని కార్యాచరణతో ముందుకు వెళ్లాలని చంద్రబాబు ఆదేశించారు. పారిశుధ్య పనులు చేప ట్టడం, నిరంతర ఫాగింగ్, సురక్షిత తాగునీరు అందిస్తే చాలా వరకు సీజనల్ వ్యాధుల సమస్య పరిష్కారం అవుతుందని సీఎం అన్నారు.

అధికారులు, శాఖల పనితీరు ఫలితాలు కనిపించేలా ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమీక్షలో మంత్రులు నారాయణ, సత్యకుమార్ యాదవ్, మూడు శాఖల అధికారులు పాల్గొన్నారు.

5

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 04, జులై 2024

## బాబుకు తెలంగాణ తమ్ముళ్ల స్వాగత ఏర్పాట్లు

- **బేగంపేట విమానాశ్రయం వద్ద ఘనస్వాగతం కోసం సమీక్ష**

**హైదరాబాద్,మహానాడు:**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలను స్వీకరించిన తరువాత మొట్టమొదటిసారిగా 5న హైదరాబాద్‌కు రానున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ తెలుగుదేశం పార్టీ తరపున చంద్రబాబుకి బేగంపేట విమానాశ్రయంలో ఘనస్వాగతం పలకాలని నిర్ణయించారు.

ఈ నిర్ణయాన్ని జాతీయపార్టీ దృష్టికి తీసుకెళ్లి వారి అనుమతితో కార్యక్రమాన్ని రూపొందించుకోవాలని నిర్ణయిం చారు. ఈ కార్యక్రమంపై చర్చించడానికి బుధవారం హైదరాబాద్ లోని ఎన్‌టిఆర్ భవన్‌లో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈ కార్యక్రమంపై నాయకుల అభిప్రాయాలను తీసుకున్నారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పొలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ... చంద్రబాబు ఏ తప్పు చేయకున్నా జగన్‌మోహన్ రెడ్డి దుర్మార్గమైన పాలనలో కక్షసాధింపు చర్యలో భాగంగానే చంద్రబాబు ని అక్రమంగా అరెస్టు చేయడం జరిగింది. ఈ సంఘటనను కలలో కూడా ఎవరూ ఊహించలేదు. జనసేన, బీజేపీ పార్టీలతో కలిసి తెలుగు దేశం పార్టీ ఎన్నికలకు వెళ్లి చరిత్రలో ఎన్నడూ రాని మెజారిటీ సీట్లతో ఎన్‌డీఏ కూటమి ఏపీలో అధికారంలోకి రావడంజరిగింది. నాల్గవసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు చరిత్రను సృష్టించారు.

హైదరాబాద్‌లోనే తెలుగుదేశం పార్టీని ఎన్‌టిఆర్ ప్రారంభించారు. తెలుగుదేశం ప్రభుత్వం చేసిన అభివృద్ధి ప్రజలకు ఉపయోగపడుతుండటం సంతోషమని, తెలుగుప్రజలు ఎక్కడ ఉన్నా ముందు ఉండాలని చంద్రబాబు ఎప్పుడూ చెబుతూ ఉంటారు. ఈ రోజు రాష్ట్ర ఆదాయంలో 40 నుంచి 50 శాతం ఒక్క హైదరాబాద్ నుంచే రావడం.. దీనికి చంద్రబాబు గారు, తెలుగుదేశం ప్రభుత్వం వేసిన పునాదులే ప్రధాన కారణం. మేమే శాశ్వతంగా ఉంటాం.. అని భావించిన కేసీఆర్..ఇప్పటి వారి, వారి పార్టీ పరిస్థితిని చూస్తే ప్రజాస్వామ్య గొప్పతనం తెలిసి వస్తుంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు వెళ్లిపోయినా, ఎన్ని తుఫానులు



వచ్చినా మనం పార్టీలోనే నిలబడి ఉన్నామని అన్నారు. నాల్గొవసారి ముఖ్య మంత్రి అయిన తరువాత మొట్టమొదటిసారిగా చంద్రబాబు హైదరాబాద్‌కు వస్తున్నందున అందరం కలిసి ఘన స్వాగతం పలికే కార్యక్రమాన్ని విజయవంతంగా జరుపుదామని అన్నారు. వేరే పనుల వల్ల ఈ సమావేశానికి రాలేకపోయినవారితో కూడా మాట్లాడి,కార్యక్రమం విజయవంతం చేసుకోవడానికి కమిటీలను కూడా ఏర్పాటు చేసుకుని ప్రణాళికాబద్ధంగా నిర్వహిద్దామని అన్నారు.

ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు పిన్నమనేని సాయిబాబా, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు బండి పుల్లయ్య, ప్రధాన కార్యదర్శులు అజ్మీరా రాజునాయక్, గడ్డి పద్మావతి, జివిజి నాయుడు, షేక్ ఆరిఫ్, అధికార ప్రతినిధులు బుగిడి అనూప్ కుమార్, డాక్టర్ ఏఎస్ రావు, సూర్యదేవర లత, మీడియా కమిటీ ఛైర్మన్ తెలుగుదేశం ప్రకాష్ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులు వేజెండ్ల కిషోర్ బాబు, కుర్రా ధనలక్ష్మి, సంధ్యపోగు రాజశేఖర్, ముత్తినేని సైదేశ్వర్ రావు, మండూరి సాంబశివ రావు, సురేందర్ సింగ్, ముదిగొండ సుభాషిని, రాష్ట్ర కార్యదర్శులు ఎండి ఇమ్రాంమ్, జలమోని రవీందర్, రాపోలు నర్సింహులు, కట్టా రాములు, నర్సింహా రావు, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు కె. గోపి, బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీపతి సతీష్ కుమార్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు పోలంపల్లి అశోక్, తెలుగునాడు ఉపాధ్యాయ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ముంజా వెంకట్రాజంగౌడ్, తెలుగునాడు కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గజేంద్రగౌడ్, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పొగాకు జయరామ్‌చందర్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పర్లపల్లి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్‌ను కలిసిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకట లక్ష్మి

**అమరావతి,మహానాడు:**

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ గజ్జల వెంకట లక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం రాజ్ భవన్ లో ఆమె గవర్నర్ కు కొండపల్లి బొమ్మ జ్ఞాపికను అందించగా ఆయన ఆత్మీయంగా పలకరించారు. చైర్ పర్సన్ గా నియామకమైన తర్వాత గజ్జల లక్ష్మి తొలిసారిగా గవర్నర్ ను కలిశారు.

ఈ సందర్భంగా గవర్నర్ నజీర్ మహిళా కమిషన్ కార్యక్రమాలను ఆమెను అడిగి తెలుసుకున్నారు. మహిళా సాధికారతతో సహా పలు అంశాలపై కమిషన్ చైర్ పర్సన్ గజ్జల వెంకట లక్ష్మి వివరణాత్మకంగా చర్చించారు. కుటుంబంలో అత్యంత శక్తిమంతమైన బరువు మోసే మహిళలకు మహిళా కమిషన్ ఊతమివ్వాలని గవర్నర్ సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్, ప్యాకేజింగ్ మరియు బ్రాండింగ్‌లో మహిళా కమిషన్ ప్రోత్సాహం అవసరమన్నారు.

గజ్జల వెంకట లక్ష్మి మాట్లాడుతూ.. మహిళలకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించడమే కాకుండా కమిషన్ వివిధ శిక్షణా కార్యక్రమాల పట్ల దృష్టి సారించినట్లు తెలిపారు.



మహిళా సాధికారతకు సంబంధించిన కమిషన్ కార్యక్రమాలకు అన్నివిధాలా అండగా ఉంటానని గవర్నర్ ఆమెకు హామీ ఇచ్చారు.

## 3నెలల్లో 1.28 లక్షల గృహాలను పూర్తి చేయాలి

- **వచ్చే మార్చి నాటికి నిర్మాణంలో ఉన్న8.02 లక్షల గృహాలను పూర్తి చేస్తాం**
- **నిర్మాణ దశలో ఉన్న 6.08 లక్షల ఇళ్ళ స్టేజ్ కన్వర్సన్కు నిర్ణయం**
- **లే అవుట్ల అభివృద్ధికి ఫ్లై యాష్ వినియోగించేందుకు చర్యలు**
- **ప్రతినెలా గృహ నిర్మాణ పధకాలపై అధికారులతో సమీక్ష**
- **రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార శాఖా మంత్రి కె.పార్ధ సారధి**

**అమరావతి,3 జూలై,మహానాడు:**

రాష్ట్రంలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కింద వచ్చే మూడు మాసాల్లో లక్షా 28వేల గృహాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కె.పార్ధ సారధి వెల్లడించారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖపై అన్ని జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లు,ఎస్ఇ,ఇఇలు ఆశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు.

అనంతరం రాష్ట్ర సచివాలయం నాల్గవ భవనంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు అన్ని ప్రభుత్వ శాఖలు 100 రోజుల కార్యాచరణను రూపొందించుకోవాలన్న ఆదేశాలకు అనుగుణంగా గృహ నిర్మాణ శాఖకు సంబంధించి 100 రోజుల కార్యాచరణ కింద రానున్న మూడు మాసాల్లో 1.28 లక్షల గృహాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించు కున్నట్టు పునరుద్ఘాటించారు.ఇందుకు గాను 2వేల 520 కోట్ల రూ. ఖర్చు చేయనున్నట్టు మంత్రి పార్ధసారధి తెలిపారు.

అంతేగాక రాష్ట్రంలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న 8.02 లక్షల గృహాలను వచ్చే మార్చి నెలాఖరుకు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు మంత్రి పార్ధసారధి చెప్పారు.అదే విధంగా నిర్మాణ దశలో ఉన్న 6.08 లక్షల గృహాల స్టేజ్ కన్వర్సన్ చేయాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. గృహ నిర్మాణాలు జరిగే లేఅవుట్ల అభివృద్ధికి సంబంధించి విశాఖపట్నం, విజయవాడ,నెల్లూరు,రాయల సీమల్లోని ధర్మల్ పవర్ స్టేషన్ల నుండి వచ్చే ఫ్లై యాష్ వినియోగించేందుకు చర్యలు తీసుకోనున్నట్టు మంత్రి పార్ధసారధి పేర్కొన్నారు.అదే విధంగా ఆప్సన్-3 కింద నిర్మాణంలో ఉన్న గృహాలకు సంబంధించిన సమస్యలపై ముఖ్యమంత్రి వర్యులతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి వివరించారు.

రాష్ట్రంలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న గృహాలను వేగవంతంగా పూర్తి చెయ్యటానికి అధికారులందరూ కృషి చెయ్యాలని ఆదేశించామని మంత్రి పార్ధ సారధి చెప్పారు. గృహ నిర్మాణాలకు సంబంధించి ఈనెలాఖరు లోగా రీకన్సి



లేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు.అంతేగాక ఇకమీదట ప్రతి నెలా గృహ నిర్మాణాల ప్రగతిని అధికారులతో సమీక్షించడం జరుగుతుందని అన్నారు.

**రాష్ట్రంలోని పేదలందరికీ సొంతిటి కలన సాకారం చేస్తాం...**

అంతకు ముందు రాష్ట్ర సచివాలయం 5వ భవనంలో జరిగిన గృహ నిర్మాణశాఖ సమీక్షలో గృహనిర్మాణ,సమాచార శాఖ మంత్రి పార్ధసారధి మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కట్టుబడి ఉందని ఆదిశగా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అర్హులందరికీ గృహాలు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం ధృడ సంకల్పంతో ఉందని కావున గృహ నిర్మాణాలను వేగవతంగా పూర్తి చేసేందుకు క్షేత్ర స్థాయిలో అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి ఆదేశించారు.

ఈ సమావేశంలో ముఖ్యంగా 2015లో ప్రారంభమైన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన,(అర్బన్) పథకం క్రింద జిల్లాల్లో గృహ నిర్మాణాల ప్రగతిని,రాష్ట్ర వ్యాప్తంగా గృహ నిర్మాణాల వంద రోజుల ప్రణాళికపై నియోజక వర్గాల వారీగా మంత్రి సమీక్షించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవాలని కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

గృహ నిర్మాణ శాఖలో ఉన్న ఖాళీలను ప్రస్తావిస్తూ పదోన్నతుల ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని,క్రింది స్థాయి ఖాళీలను జిల్లాల నుంచి లేదా డిప్యుటేషన్ ద్వారా భర్తీ చేయాలని ఉన్నతాధికారులకు సూచించారు.గృహ నిర్మాణ పథకాల అమలుకు సిబ్బంది కొరత లేకుండా చూడాలని మంత్రి పార్ధ సారధి అధికారులకు స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో ఆశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్,ప్రత్యేక కార్యదర్శి మైదీన్ దివాన్,ఎండి గిరీషా, పిడిలు, ఎస్ఇలు,ఇఇలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## అమెరికాలో గుంటూరు యువకుడి అనుమానాస్పద మృతి కేసు

- **సుఖవాసి రాజశ్రీని అదుపులోకి తీసుకున్న ఇమ్మిగ్రేషన్ అధికారులు**

**గుంటూరు,మహానాడు:**

అమెరికాలో గుంటూరు యువకుడు గంగూరి శ్రీనాథ్ అనుమానాస్పదంగా మృతి కేసులో నిందితురాలిగా ఉన్న సుఖవాసి రాజశ్రీని హైదరాబాద్ విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. శ్రీనాథ్ మృతి పై విచారణ జరపాల్సిందిగా ఆయన తండ్రి బాబురావు ఏపీ సిఐడి అధికారులను ఆశ్రయించటంతో గత ఏడాది కేసు నమోదు చేశారు.

ఈ కేసులో రాజశ్రీతో పాటు భర్త సుఖవాసి శ్రీనివాస రావు, శ్రీనాథ్ సతీమణి సాయి చరణీపై సిఐడి కేసు నమోదు చేసింది. ఈ కేసు విచారణలో ఉన్న సమయంలో కోర్టుకు, సిఐడి అధికారులకు సమాచారం ఇవ్వకుండా కుమార్తె సాయి చరణీ వద్దకు రాజశ్రీ వెళ్లారు.

ఆమె అమెరికా వెళ్లిన విషయం తెలుసుకున్న సిఐడీ లుక్ అవుట్ నోటీసు జారీ చేసింది. దీంతో బుధవారం రాత్రి ఆమె అమెరికా నుంచి వచ్చిన వెంటనే ఇమ్మిగ్రేషన్ అధికారులు హైదరాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఆమెను ఇమ్మిగ్రేషన్ అధికారులు ఏ పీ సి ఐ డీ అధికారులకు అప్పగిస్తారని సమాచారం



జార్ఖండ్ ముఖ్యమంత్రి పదవికి చంపా సోరెన్ బుధవారం రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖను రాష్ట్ర గవర్నర్‌కు పంపారు. తదుపరి ముఖ్యమంత్రిగా మాజీ సీఎం హేమంత్ సోరెన్ ప్రమాణస్వీకారం చేయనున్నారు.

## తెలంగాణలో పుష్కలంగా పర్యాటక అవకాశాలు

- **పర్యాటక అభివృద్ధికి నూతన పర్యాటక విధాన ముసాయిదా సిద్ధం**
- **ఎకో, టెంపుల్, మెడికల్ టూరిజం అభివృద్ధి**
- **పర్యాటక రంగ అభివృద్ధితో ఆర్థిక స్వయం సంవృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు**
- **సోమశిల, రామప్ప, లక్నవరం, నాగార్జున సాగర్, అనంతగిరి హిల్స్ ను డెస్టినేషన్ వెడ్డింగ్ కేంద్రాలుగా తీర్చిదిద్దుతాం**
- **అనంతగిరిలో వెల్నెస్ టూరిజం రిసార్ట్ ఏర్పాటు**
- **బుద్ధ గయా తరహాలో బుద్ధవనాన్ని తీర్చిదిద్దుతాం: మంత్రి జూపల్లి కృష్ణారావు**

**హైదరాబాద్, జూలై 3,మహానాడు:**

పర్యాటక కేంద్రంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్ది.. ఆర్థికంగా స్వయం సంవృద్ధి సాధించడం.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నూతన పర్యాటక విధాన ముసాయిదా రూపొందించామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. డా. బీఆర్. అంబేద్కర్ సచివాలయంలోని మీడియా సెంటర్ లో పర్యాటక రంగ అభివృద్ధి, సాంస్కృతిక శాఖ బలోపేతంపై మంత్రి జూపల్లి



విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

గడిచిన పదేళ్లలో పర్యాటక శాఖ ఉన్నదనే విషయం మరిచి పోయామని, పర్యాటక రంగ అభివృద్ధికి ఓ పాలసీ అంటు లేకుండా పోయిందని, గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిదని ధ్వజమెత్తారు. పర్యాటక రంగం అస్తవ్యస్తమైందని, తారామతి బరాదరి, హరిత హెూటల్స్ నిర్వహణ అధ్వన్నంగా తయారైందని, యుద్ధ ప్రాతిపాదికన పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామని, ఆరు నెలల్లోనే పురోగతి సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులను కూడా రాబట్టడంలో గత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

సీయం రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం .. పర్యాటక రంగానికి అధిక ప్రాధ్యనతను ఇస్తుందని, ఎకో, టెంపుల్, మెడికల్ టూరిజంపై ప్రధానంగా దృష్టి సారించినట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి నూతన పర్యాటక విధాన ముసాయిదాను సిద్ధం చేశామని, సీయం రేవంత్ రెడ్డి సలహాలు, సూచనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. త్వరలోనే కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రిని కలిసి తెలంగాణ పర్యాటక అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరతామని తెలిపారు.

ప్రభుత్వ - ప్రైవేట్ భాగస్వామ్యంలో పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేసి.. మౌలిక వసతులు కల్పించడం ద్వారా ఆదాయం పొందే మార్గాలను అన్వేషిస్తున్నామని అన్నారు. తెలంగాణ ప్రకృతి రమణీయమైన ప్రదేశాలు, చారిత్రక వారసత్వ సంపదకు నెలవుగా ఉందని, ఎన్నో వనరులు ఉన్నప్పటికి అనుకున్న స్థాయిలో పర్యాటకాన్ని అభివృద్ధి చేయలేకపోయామని, వనరులు లేని సింగాపూర్, దుబాయ్, ఆఫ్రికా లాంటి దేశాలు... తమ ప్రదాన ఆదాయ వనరుగా పర్యాటక రంగాన్ని మలుచుకున్నాయని పేర్కొన్నారు.

తెలంగాణను పర్యాటకాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్ది... లోకల్ టు గ్లోబల్ టూరిస్ట్ లను ఆకర్శించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కృష్ణానదీ బ్యాక్ వాటర్స్ లో సోమశిలను డెస్టినేషన్ వెడ్డింగ్, సహస పర్యాటకానికి అనువైన ప్రదేశంగా గుర్తించామని, డెస్టినేషన్ వెడ్డింగ్‌ను ప్రమోట్ చేయడానికి.. రామప్ప, లక్నవరం, నాగార్జున సాగర్, అనంతగిరి హిల్స్ వంటి ముఖ్యమైన ప్రదేశాలను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

అనంతగిరిలో వెల్నెస్ టూరిజం రిసార్ట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని చెప్పారు. మన సంస్కృతి, సాంప్రదాయాలను మేళవించి వివాహ వేడుకలు నిర్వహించేలా చూస్తామన్నారు. నాగర్జున సాగర్‌లోని బుద్ధవనాన్ని.. బుద్ధ గయా తరహాలో అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్ది తూర్పు, దక్షిణ దేశాల పర్యాటకులను అకట్టుకునేలా వసతులు కల్పిస్తామని అన్నారు.

గత ప్రభుత్వంలో ప్రతిష్టాత్మక NITHM ప్రతిష్ట మసకబారిందని, గతంలో 800 పైగా స్ట్రెంత్ ఉంటే.. ఇప్పుడు 200కు పడిపోయిందని... దీనికి పూర్వవైభవం తీసుకువస్తామని అన్నారు.

సంస్కృతి అంటే కేవలం కళలు, కళాకారులు మాత్రమే కాదని అది మన జీవన విధానాన్ని ప్రతిబింభిస్తుందని, పురాతన కళలను ఒక గొడుగు క్రిందకు తెచ్చి.. పేరిణి లాంటి నృత్య రూపాలను మరింత ప్రోత్సహిస్తామని అన్నారు. పర్యాటక ప్రదేశాలు, షాపింగ్ మాల్స్‌లో ఫ్లాష్ మాబ్స్ నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

దశరథి కృష్ణమాచార్యులు శతజయంతి ఉత్సవాలు, కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని ఈ సందర్భంగా చెప్పారు.

ఈ సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి వాణి ప్రసాద్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనెజింగ్ డెరెక్టర్ ప్రకాష్ రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 04, జులై 2024

## ఉప్పాడ సముద్రపు కోత సమస్యకు

# శాశ్వత పరిష్కారం చూపండి

- సమస్యకు శాస్త్రీయ పరిష్కారం వెతకండి
- ఉప్పాడ తీర ప్రాంతాన్ని పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- మారిటైం బోర్డు, కేంద్ర ఖగోళశాస్త్ర మంత్రిత్వశాఖ అధికారులతో కలసి తీర ప్రాంతంలో పర్యటన

ఉప్పాడ,మహానాడు:

పిఠాపురం నియోజకవర్గంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవెర్చే పనిని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మొదలుపెట్టారు. ఉప్పాడ తీర ప్రాంత గ్రామాలను సముద్రపు కోత నుంచి కాపాడే క్రమంలో కార్యచరణకు దిగారు. బుధవారం ఉప్పాడ తీరంతో సముద్రపు కోతకు గురయిన ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ మారీ టైమ్ బోర్డు, కేంద్ర ఖగోళశాస్త్ర మంత్రిత్వ శాఖ(ఎర్త్ సైన్స్ మినిస్ట్రి) అధికారులు, రెవెన్యూ అధికారులతో చర్చించారు.

సముద్రపు కోతకు గల కారణాలు, నివారణోపాయాలు వారిని అడిగి తెలుసుకున్నారు. ఉప్పాడ తీరంలోనే సముద్రం ఎందుకు ముందుకు వస్తోంది? దీనికి గల కారణాలు, తీరాన్ని కోతకు గురి కాకుండా చేయాల్సిన మార్గాలు అన్వేషించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని, దీనిపై శాస్త్రీయంగా సర్వే నిర్వహించి పనులు మొదలు పెడదామని చెప్పారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులకు తగు సూచనలు ఇచ్చారు.

ఉప్పాడ గ్రామ తీర ప్రాంతంలో మొత్తం 84 ఎకరాల విస్తీర్ణంతో భూమి సముద్రంలో కలిసిపోయిందని జిల్లా సర్వేయర్ లక్ష్మీ నారాయణ తెలిపారు. 60 ఎకరాలు కోతకు గురయ్యాక సర్వే ప్రారంభించినట్టు, సర్వే ప్రారంభించిన తర్వాత మరో 20 ఎకరాలు సముద్రంలోకి వెళ్లిపోయిన విషయాన్ని వివరించారు. మొత్తం యు.కొత్తపల్లి మండల పరిధిలోని 8 తీర ప్రాంత గ్రామాల్లో 1360 ఎకరాలు కోతకు గురైన విషయాన్ని తెలుసుకుని పవన్ కళ్యాణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

చెన్నై నుంచి ఉప్పాడ తీర ప్రాంత కోతపై పరిశోధన జరిపేందుకు వచ్చిన కేంద్ర ఖగోళశాస్త్ర మంత్రిత్వశాఖ అధికారులు, మారిటైం బోర్డు అధికారులను సముద్రపు కోతపై పూర్తి స్థాయిలో అధ్యయనం జరపాలని స్పష్టం చేశారు. ఈ





కార్యక్రమంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, పిఠాపురం నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ వర్మ, జనసేన సమన్వయకర్త మరెడ్డి శ్రీనివాస్, బీజేపీ ఇంఛార్జ్ కృష్ణంరాజు, జనసేన పార్టీ జాతీయ అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పూల వర్షంతో స్వాగతించిన ఉప్పాడ ప్రజలు

ఉప్పాడ తీరప్రాంత కోత సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు అధికారులతో కలసి అధ్యయనానికి వచ్చిన పవన్ కళ్యాణ్ ఉప్పాడ గ్రామ ప్రజలు, తీర ప్రాంత గ్రామాల ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. మత్స్యకార మహిళలు పూల వర్షం కురిపించి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు

# మొక్కల పెంపకంపై ఖచ్చితమైన ఆడిట్

- నాటిన ప్రతి మొక్క సంరక్షణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు
- ఆలోచన బాగా ఉన్న, ఆచరణ లేకపోతే ఫలితాలు దక్కవు
- ఇంటింటికి సర్వే చేసి అందించిన మొక్కల స్థితిగతుల వివరాలను తెలుసుకోవాలి
- వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు

పెద్దపల్లి, మహానాడు:

వన మహోత్సవం కార్యక్రమం క్రింద జిల్లాలో నాటిన ప్రతి మొక్క సంరక్షణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని, మొక్కల పెంపకం, సంరక్షణలో నాణ్యత పెరగాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు.

బుధవారం పెద్ద కల్వలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, మునిసిపల్ చైర్ పర్సన్ మమతా రెడ్డి లతో కలిసి మొక్కలు నాటి వన మహోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యత, మొక్కల పెంపకం, పచ్చదనం ప్రాముఖ్యత విద్యార్థి దశ నుంచే పిల్లలకు తెలియాలనే ఉద్దేశ్యంతో కళాశాల వద్ద వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని అధికారులు జవాబుదారీతనంతో పూర్తి చేయాలని మంత్రి సూచించారు.

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మొక్కలను నాటడంలో పెద్ద లక్ష్యాలను ఏర్పాటు చేసుకోకుండా, తక్కువ మొక్కలు నాటినప్పటికీ వాటిని వంద శాతం సంరక్షించాలని అన్నారు. ఇంటింటికి పంపిణీ చేసే మొక్కలు, రోడ్డుపై నాటే మొక్కల లెక్కలు పక్కాగా ఉండాలని అన్నారు.

పెద్దపల్లి, గోదావరిఖని ప్రాంతాల్లో అవసరమైన మేర మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, జిల్లాలో ప్రభుత్వం నాటుతున్న మొక్కలు, ఇండ్లకు పంపిణీ చేస్తున్న మొక్కల ఆడిట్ నిర్వహించాలని అన్నారు. మొక్కల పంపిణీ పూర్తి చేసిన తర్వాత రెగ్యులర్ గా ఇంటింటికి సర్వే నిర్వహిస్తూ ఆ మొక్కల స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని అన్నారు.

పట్టణ ప్రాంతాలలో ప్రజలకు అవసరమైన పూల మొక్కలు, ఇతర మొక్కలు కుండీలలో పెంచే విధంగా అందించే అవకాశాలు పరిశీలించాలని మంత్రి అధికారులకు సూచించారు. మన జిల్లాలో ఉన్న ఎన్.టి.పి.సి., ఆర్.ఎఫ్.సి.ఎల్., సింగరేణి, కేశోరాం సిమెంట్, రైస్ మిల్లులు, మొదలగు పరిశ్రమలు వాటి పరిధిలో పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షించేలా చూడాలని అన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం చెట్లను నరికి వేయకుండా



ట్రాన్స్ ప్లాంట్ చేసే టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందని దీనిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. మొక్కల పెంపకం ప్రాముఖ్యతను ఇంటింటికి తిరిగి వివరించి ప్రజలకు అవగాహనకల్పించాలని, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి సూచించారు.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరం జిల్లాలో 27 లక్షల మొక్కలు నాటేందుకు కార్యాచరణ రూపొందించామని, వంద శాతం నాటిన మొక్కల సంరక్షణకు ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు.

పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ, మంత్రి చేతుల మీదుగా వన మహోత్సవం కార్యక్రమం ప్రారంభించుకోవడం చాలా సంతోషకరమని అన్నారు. గతంలో జరిగిన పొరపాట్లను అధిగమిస్తూ వన మహోత్సవం కార్యక్రమాన్ని ముందుకు తీసుకుని పోవాలని అన్నారు.

పెద్దపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ మమతా రెడ్డి మాట్లాడుతూ, చెట్ల సంరక్షణ ద్వారా భూ సంరక్షణ సాధ్యమవుతుందని అన్నారు. పెద్దపల్లి పట్టణంలో మున్సిపల్ బడ్జెట్ లో 10 శాతం గ్రీన్ బడ్జెట్‌కు కేటాయించుకొని ప్రస్తుత సంవత్సరం లక్షా 30 వేల మొక్కల పెంపకం లక్ష్యంగా ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. గ్రీన్ పెద్దపల్లి రూపకల్పన కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలలో పౌరులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో ఏ.సి.పి. జి.క్రిష్ణ, పెద్దపల్లి మున్సిపల్ కమీషనర్ శ్రీకాంత్, జిల్లా అటవీ శాఖ అధికారి శివయ్య, డి.ఆర్.డి.ఓ. రవీందర్, జెడ్పీ సి.ఈ.ఓ.నరేందర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, జెడ్పిటిసి రామ్మూర్తి, మున్సిపల్ కౌన్సిలర్‌లు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# టెట్, మెగా డీఎస్సీ గడువు పెంపు!

అమరావతి, మహానాడు:

టెట్, మెగా డీఎస్సీ అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు పరీక్షల గడువు పెంచనున్నట్లు సమాచారం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే 16,347 పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేశారు. ఈ మొత్తం ప్రక్రియను ఆరు నెలల్లో పూర్తి చేసేందుకు రంగం సిద్ధం చేశారు. అయితే నూతనంగా బీఈడీ, డీఈడీ పూర్తి చేసుకున్న వారికి కూడా మెగా డీఎస్సీ రాసేందుకు అవకాశం కల్పించేలా టెట్ నిర్వహించాలని వచ్చిన అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకొని టెట్ నిర్వహించడానికి నోటిఫికేషన్ జారీ చేసింది. టెట్, మెగా డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమవడానికి తమకు మరింత సమయం ఇవ్వాలని అభ్యర్థులు, వివిధ విద్యార్థి, యువజన సంఘాలు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. అందరి అభిప్రాయాలు తీసుకున్న



తర్వాత అభ్యర్థులు పరీక్ష రాయడానికి సన్నద్ధమవ్వడానికి, టెట్ పరీక్ష నిర్వహణకు 90 రోజులు, మెగా డీఎస్సీ నిర్వహణ కు 90 రోజుల సమయం ఇవ్వాలని నిర్ణయించింది. త్వరలోనే టెట్, డీఎస్సీ నిర్వహణకు కొత్త తేదీలను ప్రభుత్వం ప్రకటించనుంది.





## సూరప్ప చెరువు సమ్మర్ స్టోరేజ్

# ట్యాంకును పరిశీలించిన పవన్ కళ్యాణ్

నాగులాపల్లి,మహానాడు:

పిఠాపురం నియోజకవర్గం, నాగులాపల్లి వద్ద సూరప్ప చెరువు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ పరిశీలించారు. నాబార్డు నిధులతో 22 ఎకరాల్లో నిర్మించిన ఈ ట్యాంకు ద్వారా యు.కొత్తపల్లి మండల పరిధిలోని 54 గ్రామాలకు అందిస్తున్నారు.

బుధవారం ఉప్పాడ తీర ప్రాంత సందర్శనకు వెళ్తూ మార్గమధ్యంలో సూరప్ప చెరువును పరిశీలించారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు, తాగు నీటిని శుభ్రపరిచే విధానం, ల్యాబ్ లు పరిశీలించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కాకినాడ కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, పిఠాపురం జనసేన ఇంఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ తదితరులు పవన్ కళ్యాణ్ తో ఉన్నారు.

ఉప్పాడ తీర ప్రాంతంలో సముద్రపు కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించేందుకు వెళ్తూ గ్రామ గ్రామాన ప్రజలను కలుస్తూ వారి సమస్యలు తెలుసుకుంటున్నారు. పిఠాపురం, నవకంద్రవాడ, వాకతిప్ప, యు.కొత్తపల్లి తదితర గ్రామాల్లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. దారి పొడుగునా ప్రజలు పవన్ కళ్యాణ్‌కి స్వాగతం పలుకగా అందరికీ అభివాదం చేసుకుంటూ ముందుకు కదిలారు.

# విద్యార్థుల సమస్యలపై మంత్రి సవితమ్మకు లేఖ

- ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి సవితమ్మ
- హాస్టల్లో ఆకస్మిక తనిఖీ చేసి లోటుపాట్లపై ఇంచార్జ్ ఎస్ఓపై మండిపడ్డ మంత్రి సవితమ్మ
- హాస్టల్ ఇన్చార్జ్ వార్డెన్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు

పెనుకొండ, మహానాడు:

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం సోమందేపల్లి మండలం పాపిరెడ్డిపల్లి కేజీబీవీ పాఠశాలకు సంబంధించిన విద్యార్థుల సమస్యలపై కథనం ప్రచురితమైంది కథనానికి స్పందించిన మంత్రి సవితమ్మ ఆకస్మిక తనిఖీ చేపట్టారు.

పాపిరెడ్డి పల్లి వద్ద ఉన్న కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మకు సమస్యలపై లేఖ రాశారు. ప్లీజ్ మా సమస్యలు పరిష్కరించండి అంటూ విద్యార్థుల సంతకాలతో రాసిన లేఖ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఉన్నతాధికారులకు సమస్యలపై తెలిపినా పట్టించుకోలేదంటూ లేఖలో అవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో సమస్యలు తెలిసినా ఎవరికి చెప్పుకోలేక దీనస్థితిలో ఉన్న తల్లిదండ్రులు ఉన్నారని, ఈ పాఠశాలలో ఆరవ తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు 250 మంది విద్యార్థుల పరిస్థితిపై వివరంగా లేఖలు రాశారు. ఈ క్రమంలో పాఠశాలను తనిఖీ చేసిన మంత్రి సవితమ్మ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మీ ఇళ్లలో ఇలాగే వంట చేసి పిల్లలకు వడ్డిస్తారా అంటూ మండిపడ్డారు.



సమస్యలపై విద్యార్థినులతో వ్యక్తిగతంగా మాట్లాడారు. ముఖ్యంగా హాస్టల్ ఇంచార్జ్ ఎస్ఓ శాలినిదేవి తమతో డబ్బులు వసూలు చేస్తున్నారని, అర్ధరాత్రి సమయంలో ఇంచార్జ్ ఎస్ఓ హాస్టల్ నుండి బయటకు వెళ్లడం రావడం తమకు భయమేస్తుందని తెలియజేశారు. మంత్రి హాస్టల్ లోని వంటగదిని పరిశీలించి అక్కడ కుళ్ళిపోయిన కాయగూరలను చూసి హాస్టల్ వార్డెన్ తో మీ ఇంటికి కూడా ఇలాంటి కాయగూరలతో భోజనాలు చేస్తారా అంటూ ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. బాత్ రూమ్‌లను పరిశీలించి శుభ్రంగా లేకపోవడంతో హాస్టల్ వార్డెన్‌పై మండిపడ్డారు. హాస్టల్ వార్డెన్ శాలినిదేవి వ్యవహార శైలిపై, ఆమెపై వచ్చిన ఆరోపణలతో వెంటనే శాలిని దేవిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అధికారు లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యం

- ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి
- ఇనమడుగు పిహెచ్‌సిలో వసతులు మెరుగుపరుస్తా..
- కోవూరు మండలంలో మరో పిహెచ్‌సి ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

కోవూరు, మహానాడు :

నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా పని చేయడమే తమ లక్ష్యమని కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. బుధవారం కోవూరు మండలంలోని ఇనమడుగులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి స్థానిక వైద్య సిబ్బందితో చర్చించారు. పరీక్షలకు సంబంధించి ల్యాబ్ టెక్నీషియన్ ని అడిగి వివరాలు ఆరా తీశారు. ఇనమడుగు పిహెచ్‌సిలో అందిస్తున్న వైద్య సేవలు, సిబ్బంది వ్యవహార శైలి గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు.అన్ని విభాగాలను పరిశీలించి వసతులు, సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రోగులను పరామర్శించి వారికి పండ్లు అందించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా పని చేయడమే తమ లక్ష్యమని అన్నారు. ప్రస్తుతం కోవూరు మండలం లో 80 వేల మంది ఉండగా.. వాళ్లకు కేవలం ఒక పీహెచ్‌సీ మాత్రమే ఉందన్నారు. తప్పకుండా ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రెండో పిహెచ్‌సి ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు పేదలే వస్తుంటారని, వారి పట్ల ప్రేమగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. వైద్యారోగ్యంపై ప్రభుత్వం వేల కోట్లు వెచ్చిస్తోందని, అవి



సద్వినియోగం అయ్యేలా బాధ్యతాయుతంగా పని చేయాలని ఆదేశించారు. ఇనమడుగు పిహెచ్‌సిలో స్థానిక డాక్టర్లు ఆమె దృష్టికి తెచ్చిన సమస్యలపై స్పందిస్తూ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. దేశంలోనే ప్రతిష్టాత్మక నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్ గుర్తింపు సాధించిన విడవలూరు మండలంలోని రామతీర్థం పిహెచ్‌సిని ఆదర్శంగా తీసుకొని ఉత్తమ ప్రమాణాలతో వైద్య సేవలు అందించాలని సూచించారు. స్థానిక సర్పంచ్ తదితర ప్రజా ప్రతినిధులు సైతం తరచూ ఆసుపత్రిని సందర్శించి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు.


ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి నిరంజన్, సిబ్బందితో పాటు ఆశా వర్కర్లు, ఎఎన్ఎమ్ లతో పాటు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, ఎంపీపీ పార్వతి, ఎంపీటీపీ కొల్లా సునీల్ రెడ్డి, సర్పంచి ప్రమీలమ్మ, ముఖ్య నాయకులు సుధాకర్‌రెడ్డి, గుత్తికొండ వెంకయ్య, దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, కమలాకరరెడ్డి, జనసేన నాయకులు గుడి శ్రీహరి రెడ్డి,తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 04, జూలై 2024

# బ్రాయిలర్ చికెన్ తింటున్నారా? బీ కేర్ ఫుల్!

(జాజుల కృష్ణ)

బాయిలర్ చికెన్ విషపూరిత ఇంజక్షన్. అంటే చిన్న పిల్ల 10 రోజుల్లోపు ఒక చుక్క కంట్లో వేస్తారు. అలాగే 25 రోజుల తర్వాత ఒక చుక్క నోట్లో వేస్తారు. అలా 40 రోజులలో రెండున్నర కేజీల చికెన్ తయారవుతుంది.



బ్రాయిలర్ కోళ్లకు అన్నిటికీ వ్యాక్సిన్ వేస్తారు. అలా చేయడం వల్ల అవి ఎక్కువ మేతతిని, ఎక్కువ నీళ్లను త్రాగుతాయి. అందువల్ల అంత స్పీడుగా ఎదుగుతాయి. చికెన్ విషపూరితమైన




మాంసం తిన్న వారికి, క్యాన్సర్ అతి భయంకరమైనవ్యాధులు అతి భయం కరమైన వైరస్‌లు వచ్చే అవకాశం మెండుగా ఉంది.సాంకేతిక పరంగా శాస్త్రవేత్తలు ఈ విధంగా నిరూపించ బడినది. కాబట్టి బీ కేర్ ఫుల్...



## నేడు ప్రధానితో సీఎం చంద్రబాబు భేటీ

అమరావతి, మహానాడు :

ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనకు బయల్దేరారు. గురువారం ఉదయం 10.15 గంటలకు ప్రధాని మోదీతో సీఎం భేటీ అవ్వనున్నారు. రాష్ట్రానికి ఆర్థిక సాయం, ఇతర అంశాలను ప్రధానికి వివరించనున్నారు. ప్రధానితో భేటీ అనంతరం హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లతో వేర్వేరుగా చంద్రబాబు సమావేశం కానున్నారు. పోలవరం, అమరావతి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఆర్థిక మంత్రికి నివేదిక ఇవ్వనున్నారు.

## కొలికపూడి వివరణ కోరిన సీఎం చంద్రబాబు

గుంటూరు,మహానాడు:

ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం కంభంపాడులో మంగళవారం జరిగి ఘర్షణపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుని పిలిపించి వివరణ కోరారు. కొందరు అధికారుల తీరులో ఇంకా మార్పు రాలేదని, నిబంధనల ప్రకారం వ్యవహరించాలని తాను కోరినా వారి నుంచి స్పందన లేనందుకే వెళ్లాల్సి వచ్చిందని కొలికపూడి వివరించారు. 2013లో చంద్రబాబు కాన్వాయ్‌పై రాళ్లదాడి, ఇటీవల ఎన్నికల సందర్భంగా కేశినేని చిన్నిపై రాళ్ల దాడి ఘటనను వివరించారు. చట్ట పరిధిలో దోషుల్ని శిక్షిద్దాం.. క్షేత్ర స్థాయికి వ్యక్తిగతంగా వెళ్లొద్దని చంద్రబాబు కొలికపూడికి సూచించినట్టు సమాచారం.

## పెళ్లికి నిరాకరించాడని బాయ్‌ఫ్రెండ్ ప్రైవేట్ పార్ట్ కట్ చేసిన డాక్టర్

బీహార్,మహానాడు:

శరణ్ జిల్లాలో ప్రకాష్ అనే యువకుడు ఓ యువ మహిళా డాక్టర్‌తో 5 ఏళ్లుగా ప్రేమలో ఉన్నాడు. పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తెస్తుండగా నిరాకరిస్తూ వస్తున్నాడు. చివరికి రిజిస్టర్ మ్యారేజ్ చేసుకోవడానికి అంగీకరించి



చివరి నిమిషంలో రాక పోవడంతో ఆగ్రహించిన యువతి అతడి ఇంటికి వెళ్లి ప్రైవేట్ పార్ట్ కట్ చేసింది. అనంతరం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలి

- ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామ పట్టణం మహానాడు :

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంతో పేద విద్యార్థులు ఉన్నతమైన స్థానాలు అధిరోహిస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. బుధవారం నందిగామ ఓసి క్లబ్ లో జరిగిన నందిగామ, తిరువూరు డివిజన్ స్థాయి అన్ ఎయిడెడ్ ప్రైవేట్ యాజమాన్యాల ప్రాథమిక ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల కరస్పాండెంట్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను




అందించేందుకు కొత్త ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసిందని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఫలితాలు సాధించాలని సూచించారు. త్వరలో మరోసారి విద్యాశాఖ అధికారులు, పాఠశాలల కరస్పాండెంట్లతో కలిసి కూలంకషంగా సమీక్షిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో నందిగామ తిరువూరు డివిజన్లకు సంబంధించిన ఎంఈఓలు, పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

# 'సాక్షి'కి మనస్సాక్షే లేదు

### టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్ కుమార్

- పిల్లలపై పిడుగు పేరుతో సాక్షిలో తప్పుడు రాతలు
- ఫీజులు చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బంది పెట్టింది వైసీపీనే
- వైసీపీ ప్రభుత్వంలో దాదాపు రూ. 3,480 కోట్ల బకాయిలు
- అప్పుడు డబ్బులు ఉన్నప్పుడు చెల్లిస్తామని కల్లబొల్లి కబుర్లు
- 2023లో కట్టాల్సిన బకాయిలకు 2024 లో బటన్ నొక్కి డబ్బులు ఇవ్వలేదు
- తల్లుల ఖాతాలో డబ్బులు వేశామని మోసం చేశారు
- ఇప్పుడు ఫీజుల పేరుతో సిగ్గులేని రాతలు రాస్తున్నారు

మంగళగిరి,మహానాడు:

టీడీపీ అధికారం చేపట్టి కనీసం 20 రోజులు కాకుండానే పిల్లలపై పిడుగు అంటూ సాక్షిలో తప్పుడు రాతలు, అబద్ధపు వార్తలు రాయడానికి కనీసం సిగ్గుండాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్ కుమార్ మండిపడ్డారు. సాక్షిలో తప్పుడు రాతలు రాస్తుంటే సాక్షి ఎడిటర్ బుర్రలేకుండా అబద్ధపు రాతలను ప్రోత్సహిస్తున్నారా అని విజయ్ కుమార్ ప్రశ్నించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఫీజు రీయింబర్స్ మెంట్, విద్యావసతి బకాయిలు దాదాపు రూ. 3,480 కోట్లు విద్యార్థులకు చెల్లించకుండా ఇబ్బంది పెట్టారని ఆగ్రహించారు. తల్లుల ఖాతాల్లో డబ్బులు వేశామని చెప్పి మోసగించారన్నారు. మంగళగిరి టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

నీలాయపాలెం విజయ్ కుమార్ మాట్లాడుతూ...

సాక్షి, వైసీపీ రెండు వేరు వేరు కాదు ఒక్కటే. వైసీపీ ఓడిపోయాక ఏం చేయాలో తెలియక పేపర్ ఉందని సిగ్గు శరంలేని రాతలు రాస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ కట్టలేదని తప్పుడు రాతలు రాస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చి సోమవారానికి 19 రోజులే అయ్యింది. అప్పుడే సాక్షి రోత రాతలు రాస్తోంది. ఒక్క ఛాన్స్ అని జనాలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి వ్యవస్థలను సర్వనాశనం చేయడమే కాక ఖజానాను ఖాళీ చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి ఇప్పుడు ఇలా రాయడం సిగ్గుచేటు. సాక్షికి ఎడిటర్ ఉన్నాడో లేడో... ఉంటే అతనికి బుర్ర ఉందో లేదో తప్పుడు రాతలను అబద్ధపు రాతలను ప్రోత్సహిస్తాడా? సిగ్గు శరం లేకుండా సాక్షిలో వార్తలు రాస్తున్నారు కాబట్టే మైకు ముందుకు వచ్చి ప్రజలకు నిజం చెప్పాల్సిన దుస్థితి వచ్చింది.



సాక్షిలో వచ్చిన వార్త ప్రకారం 2024 జూన్ నాటికి 3,480 కోట్లు విద్యార్థులకు ఫీజులు కట్టాలని చెబుతోంది. మూడు నెలలకు ఒకసారి కాలేజీలకు ఫీజ్ రీయింబర్స్ మెంట్ చెల్లిస్తానని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఫీజులు కట్టకుండా వాయిదా వేసుకుంటూ వచ్చారు. గత సంవత్సరం 2023 జూన్‌లో ప్రారంభమైన విద్యాసంవత్సరాన్నికి కేవలం ఒక్క త్రైమాసికానికి మాత్రమే డబ్బులు రిలీజ్ చేసింది. అది కూడా 2023 జూన్ లో కట్టాల్సిన వాయిదాకు 2024న మార్చి 1 పామర్రులో బటన్ నొక్కారు కానీ డబ్బులు వేయలేదు. 2023 జూన్ లో విద్యా సంవత్సరం ప్రారంభం అయితే 2024 మార్చి వరకు ఒక్క రూపాయి కూడా ఎందుకు చెల్లించలేదో జగన్ రెడ్డే సమాధానం చెప్పాలి ? సంవత్సరం పాటు బకాయి పెట్టి సిగ్గులేకుండా నేడు పిల్లలపై పిడుగు అంటూ రోత రాతలు రాస్తున్నారు. జగన్ రెడ్డి అప్పులు పెట్టి.. ఇప్పుడు కొత్తగా వచ్చిన ప్రభుత్వాన్ని 18 రోజుల్లోనే కట్టమని చెప్పడం కంటే దారుణం ఏమైనా ఉందా.

9,64,066 మంది విద్యార్థులకు ఫీజులు కట్టకుండా జగన్ రెడ్డి మోసం చేశాడు. జగన్ రెడ్డి ఫీజులు కట్టకపోతే నానా అగచాట్లు పడి పిల్లలే ఫీజులు కట్టుకుని పరీక్షలు రాసుకున్నారు. సర్టిఫికేట్లు తీసుకున్నారు. మేము ఇప్పుడు దానికి పరిష్కారం కోసం చూస్తుంటే సిగ్గులేకుండా ఫీజులు కట్టలేదని సాక్షిలో రాస్తున్నారు. రాసే వార్త తప్పు, అబద్ధం అని తెలియడం లేదా. సాక్షి మేనేజింగ్ డైరెక్టర్ ఏం చేస్తున్నారు ? 19 రోజుల్లోనే ఫీజులు కట్టాలని జగన్ రెడ్డి, ఆయన తోక పేపర్ ఎలా అడుగుతారు? తల్లిదండ్రుల అకౌంట్ లో డబ్బులు వేయకుండా మళ్లీ రోత రాతలు రాస్తారా? చేయాల్సింది అంతా చేసి రాష్ట్రంపై, విద్యార్థులపై పిడుగులు వేసి వారిని ఇబ్బంది పెట్టారు. అందుకే దారుణంగా ఓడిపోయారు. మీ అస్మదీయు కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించుకున్న నీవు పిల్లల ఫీజులు ఎందుకు చెల్లించలేదు జగన్ రెడ్డి? సంవ్సతరం పాటు విద్యా వసతి రూ. 1200 కోట్లు ఎందుకు వేయలేదు ? మూడు సంవత్సరాల ఫీజు ఫీజు రీయింబర్స్ మెంట్ ఎందుకు బాకీ పెట్టి పోయావ్ జగన్ రెడ్డి?

నీవు చెత్త రాతలు రాస్తుంటే మేము రోజు దానికి సమాధానం చెప్పాలా? ఫిజికల్ బేస్డ్ పద్ధతిలో ఎప్పుడు డబ్బులు ఉంటే అప్పుడు చెల్లిస్తామని మీ జవహర్ రెడ్డి చేత చెప్పించిన విషయం మరచిపోయారా అప్పుడే. మీరు మాత్రం ఫిజికల్ బేస్డ్ లో పద్ధతిలో చెల్లిస్తారు. మేము మాత్రం మీరు పెట్టిన బకాయిలు ఒకేసారి చెల్లించాలా ఇదేమైనా న్యాయమా? ఖజానాను నిండుకుండలా పెట్టి పోయారా ఏమైనా.. మేము వెంటనే మీరు ఉంచిపోయిన బకాయిలన్నీ చెల్లించడానికి జగన్ రెడ్డి. ఖజానాను ఖాళీ చేసి కాస్తైన ఇంగితం లేకుండా నీతిమాలిన రాతలు రాస్తారా మళ్లీ. రాష్ట్ర ప్రజలను దోచుకున్న డబ్బులన్నీ ఏం చేశారో ఎవరికీ తెలియదు. 2022 -23 బ్లాక్ లో 40,000 నుండి లక్షా ఐదువేలకు పెంచామని డబ్బా కొట్టుకుని మీ అనుకూల ఇంజనీరింగ్ కాలేజీలకు దోచి పెట్టారు. ఇప్పుడు ఇంకా ఫీజు రెగ్యులేషన్ కమిషన్ ఏ ఫీజులు ఇవ్వాలో స్పష్టం చేయలేదు. మూడు త్రైమాసిక బకాయిలు అలాగే ఉంది. విద్యా వసతి దీవేన అలానే ఉంది. ఇంత అప్పు పెట్టి విద్యార్థుల ఉసురు పోసుకుని మళ్లీ వైనాట్ 175 అంటా సిగ్గులేకుండా.

విద్యావ్యవస్థను ప్రక్షాళనకు టీడీపీ ప్రయత్నిస్తోంది. ఎవరికి ఏ విధమైన భారం పడకుండా ప్రభుత్వం చూస్తోంది. ఖచ్చితంగా ఫీజులన్నీ చెల్లిస్తాం.. సర్టిఫికేట్లు అన్ని విద్యార్థులకు ఇవ్వమని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మౌఖికంగా కాలేజీలను ఆదేశించారు. ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతూ.. దశల వారీగా ఫీజులన్నీ చెల్లిస్తాం.. అందులో ఏ డౌట్ లేదు. ఏ వర్గాన్ని వదలకుండా అన్ని వర్గాలను నాశనం చేసి మళ్లీ చెత్త రాతలు రాస్తే వచ్చే ఓట్లు కాదు కాదా ఉన్న ఓట్లు పోవడం ఖాయం. విద్యార్థుల్లో భయోత్పాతాన్ని సృష్టించడానికి వైసీపీ యత్నిస్తోంది. ఇకనైన ఇటువంటి వెదవ రాతలు మానుకోవాలి.

ప్రజలకోసం పనిచేసే ప్రభుత్వం ఇది. విద్యార్థులు ఏ రకమైఅభద్రతాభావానికి లోనుకావద్దని భరోసా ఇచ్చారు.

## కార్యాలయాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ

నరసరావుపేట, మహానాడు :

నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ కాంపౌండ్ లో బుధవారం పల్నాడు జిల్లా ఎస్పీ మలీకా గార్గ్, ఐపిఎస్ గారు నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న రెనోవేటెడ్ జిల్లా కమ్యూనికేషన్ ఆఫీసు బిల్డింగును ప్రారంభోత్సవం చేశారు. దానిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా కమ్యూనికేషన్ వ్యవస్థ పటిష్టంగా ఉండాలని సూచించారు. ఇట్టిప్రారంభోత్సవ కార్యక్రమంలో పల్నాడు జిల్లా అడ్మిన్ ఎస్పీ R. రాఘవేంద్ర, క్రైమ్ అడిషనల్ ఎస్పీ ఎస్. లక్ష్మిపతి, ఎఆర్ డిఎస్పీ గాంధీ గారు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ బి.సురేష్ బాబు, యు.శోభన్ బాబు, కమ్యూనికేషన్ ఇన్స్పెక్టర్, చిన్న వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## అభివృద్ధిపై దృష్టి పెట్టిన ఎమ్మెల్యే భాష్యం

- అధికారులతో కలిసి నియోజకవర్గంలో పర్యటన

పెదకూరపాడు, మహానాడు:

పెదకూరపాడు నియోజకవర్గ R & B అధికారులతో కలిసి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ నియోజకవర్గంలో పర్యటించారు. పలు బ్రిడ్జిలు, రోడ్లను పరిశీలించి వాటి పై అధికారులను నివేదిక కోరారు. నియోజకవర్గ పరిధిలో రోడ్ల మరమ్మత్తులు, నిర్మాణంలో ఉన్న, నిర్మించాల్సిన బ్రిడ్జిలు త్వరితంగా పూర్తిచేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను కోరారు. అనంతరం R & B మినిస్టర్‌ని కలిసి నియోజకవర్గ రోడ్ల మరమత్తుల నిమిత్తం





నిధులు విడుదల చేయాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ ఏ ప్రాంత అభివృద్ధికైనా తొలి మెట్టు రోడ్ల నిర్మాణం అన్నారు. ఏ ప్రాంతమైనా వ్యవసాయ, వాణిజ్య, వ్యాపారపరంగా అభివృద్ధి చెందాలంటే రోడ్లు ప్రముఖ పాత్ర పోషిస్తాయన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదర్శంతో మొట్టమొదటిగా రోడ్ల నిర్మాణంపై దృష్టి పెట్టామన్నారు. త్వరలో అధికారులందరితో సమీక్ష సమావేశాలు నిర్వహించి దశలవారీగా అన్ని రంగాల అభివృద్ధిపై దృష్టి సారిస్తామన్నారు. పెదకూరపాడు నియోజకవర్గాన్ని ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తానన్నారు.

## అయ్యో పాపం పోలీసు...

- కారులో విగతజీవిగా ఎస్సై నాగేశ్వరరావు

భీమవరం, మహానాడు :

కొద్ది రోజుల్లో రిటైర్మెంట్ అయ్యి ప్రశాంతంగా శేష జీవితం గడపాల్సిన ఆ పోలీసు అధికారి ఎవరూ లేని అనాధగా చనిపోవడం హృదయాల్ని కలచివేసింది. వివరాల్లోకి వెళితే... ఎన్టీఆర్ జిల్లాలో ఎస్సై గా పనిచేస్తున్న ఎ.నాగేశ్వరరావును ఎన్నికల బదిలీలలో భాగంగా భీమవరం బదిలీ చేశారు. మూడు నెలల్లోనే యదావిధిగా పాత స్థానాలకు వేస్తారని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాడు. ఐదు నెలలు గడిచినా వీరిని పట్టించుకునే వారే లేరు. ఒక పక్క రిటైర్మెంట్ దగ్గర పడుతుంది. కుటుంబానికి దగ్గరగా ఉండి, పిల్లా పాపలతో సంతోషంగా గడపాల్సిన సమయం.. నిత్యం ఈ ఆలోచనలతో సతమతమవుతూ తన బాధను దిగమింగుకొని ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం రాత్రి నైట్ రౌండ్స్ వెళ్లి ఇంటికి చేరుకున్నాడు.... తెల్లవారిన తర్వాత కూడా భర్త ఇంటికి రాకపోవడాన్ని గమనించిన భార్య ఉదయాన్నే తన తోటి ఉద్యోగులకు ఫోన్ చేసి సార్ ఎక్కడ ఉన్నారు ఇంకా ఇంటికి రాలేదు అని ఆరా తీసింది.



మేడం... సార్ నాలుగు గంటలకే ఇంటికి వచ్చేశారు నేను మా ఇంటికి వచ్చేశాను అని చెప్పాడు. అన్ని చోట్లా వెతకగా తాను ఉంటున్న అపార్ట్మెంట్ లోని సెల్లార్ లో ఉన్న కారులో చనిపోయి ఉన్నాడు. ఈ ఘటన గురించి తెలుసుకున్న స్థానికులు, పోలీసులు అయ్యో పాపం అంటూ బాధను వెలిబుచ్చారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | గురువారం 04, జూలై 2024

# వెండితెర ఘటోత్కచుడు.. ఎస్వీ రంగారావు

**గుంటూరు, మహానాడు :**
భారతీయ సినీ చరిత్రలో నిలిచిపోయే దిగ్గజ నటులలో ఎస్. వి. రంగారావు ఒకరు అని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ అన్నారు.ఎస్. వి. రంగారావు జయంతి ని పురస్కరించుకుని తెలగ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో కాపు హాస్టల్ లో నిర్వహించిన ఎస్.వి. రంగారావు జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ వెండితెర మీద నవరసాలు అత్యద్భుతంగా పండించిన గొప్ప నటుడన్నారు. జానపదాలు, పౌరాణికాలు, చారిత్రాత్మకాలు, సాంఘికాలు.. అన్ని రకాల సినిమాల్లో నటించారన్నారు.ఈ కార్యక్రమంలో




బలిశెట్టి విజయ్,రేపల్లె నవీన్, సోదా శివరాం,శేషం సుబ్బారావు, కిరణ్,మాదాసు బలరాం,గోపి,అరిగల రవి,చిల్లలరా భాస్కర, హాస్టల్ వార్డెన్ రోహిత్ తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి గొట్టిపాటిని కలిసిన కోడెల శివరాం

**అద్దంకి, మహానాడు :**
తెలుగుదేశం పార్టీ నాయకులు, అద్దంకి శాసన సభ్యుడు, విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గొట్టిపాటి రవికుమార్‌ను బుధవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యువనేత డాక్టర్ కోడెల శివరాం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తన మిత్రుడైన రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## రోడ్లు బాగు చేయాలంటూ
# మంత్రికి ఎమ్మెల్యే వినతి

**పెదకూరపాడు, మహానాడు:**
నియోజవర్గంలోని రోడ్లు దుర్భరంగా తయారయ్యాయని, వాటి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్



ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కోరారు. బుధవారం సచివాలయంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని, నియోజకవర్గ R & B అధికారులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసి రోడ్ల మరమ్మతుల నిమిత్తం వినతి పత్రం అందించారు.

## నాగబాబును కలిసిన జిల్లా నాయకులు

**గుంటూరు, మహానాడు :**
జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబును ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు



మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



## కన్నాను పరామర్శించిన జూలకంటి

**సత్తెనపల్లి, మహానాడు :**
సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణను మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి బుధవారం కలిశారు. కన్నా శస్త్ర చికిత్స చేయించుకున్న అనంతరం వారి స్వగృహంలో పరామర్శించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని బ్రహ్మానంద రెడ్డి ఆకాంక్షించారు.



## గొట్టిపాటిని కలిసిన మక్కెన

**వినుకొండ, మహానాడు :**
వినుకొండ మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జున రావు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని ఆయనకు అభినందనలు తెలియజేశారు. వీరిద్దరూ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. విద్యుత్ లోటును తీర్చి రాష్ట్రంలో వెలుగులు నింపాలని మక్కెన గొట్టిపాటి రవిని కోరారు సమర్ధుడైన రవి చంద్రబాబు మంత్రివర్గంలో విద్యుత్ శాఖ మంత్రిగా పేరు తెచ్చుకోగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే మక్కెనతోపాటు సీనియర్ న్యాయవాదులు నలబోలు రామకోటేశ్వరరావు, కట్ట కోటయ్య తదితరులు ఉన్నారు.



## హత్రాస్ బాధితులకు
# సీఎం యోగి పరామర్శ

**ఉత్తరప్రదేశ్, మహానాడు :**
ఉత్తర ప్రదేశ్ హత్రాస్ జిల్లాలోని రతిభాన్పూర్‌లో నిర్వహించిన శివారాధనలో తొక్కిసలాట జరిగి ఇప్పటి వరకూ 120 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 28 మందికి పైగా గాయపడి వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ బుధవారం హత్రాస్ కు చేరుకుని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వారికి అందుతున్న వైద్యం గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందేలా చూడాలని కోరారు.



# డికెతో షర్మిల భేటీ

**బెంగళూరు, మహానాడు :**
కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ను, ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి బుధవారం ఉదయం ఆయన నివాసంలో కలిశారు. ఈ నెల 8న విజయవాడలో నిర్వహిస్తున్న వైఎస్ఆర్ 75వ జయంతి వేడుకలకు హాజరవ్వాలని కోరారు. అదేవిధంగా ఏపిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై ఇరువురి మధ్య చర్చ జరిగింది.

## ఎమ్మెల్యే కొలికపూడిపై కేసు నమోదు

**తిరువూరు, మహానాడు :**
ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస రావుపై బుధవారం కేసు నమోదయింది. కంభంపాడు వైసీపీ ఎంపీపీ నాగలక్ష్మికి చెందిన ఇంటిని ఎమ్మెల్యే కొలికపూడి, టీడీపీ నాయకులు ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనలో వీడియోల ఆధారంగా ఇప్పటివరకు 68 మందిని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.





## తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసు..

- పోలీసుల అదుపులో నిందితులు

**మంగళగిరి, మహానాడు :**
మూడేళ్ల క్రితం మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనలో నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు మంగళవారం అర్ధరాత్రి తర్వాత కొంతమందిని అదుపులోకి తీసుకున్నారు. నాలుగు బృందాలుగా ఏర్పడిన పోలీసులు నిందితుల వివరాలను గత రెండు, మూడు రోజులుగా సేకరించారు. విధ్వంసానికి పాల్పడిన వారిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. దుండగుల్లో గుంటూరుకు చెందిన వైకాపా నాయకులు, కార్యకర్తలే ఎక్కువ మంది ఉన్నట్లు నిర్ధారించారు. అయితే, పోలీసులు తమ కోసం గాలిస్తున్నారని పసిగట్టిన నిందితుల్లో పలువురు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. వీరిలో కొందరు తెదేపాలో చేరతామని రాయబారాలు కూడా నడిపినట్లు సమాచారం. అయినా, పోలీసులు గుంటూరుకు చెందిన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వైకాపా నాయకులు, విద్యార్థి విభాగం నాయకులను మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మరికొందరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# భార్య చేతిలో భర్త హతం

**బంటుమిల్లి, మహానాడు :**
భార్య చేతిలో భర్త హతమైన సంఘటన కృష్ణాజిల్లా బంటుమిల్లి మండల పరిధిలోని చిన్న తుమ్మడి గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం తుమ్మడి గ్రామానికి చెందిన జి అప్పారావు (30), కీర్తనలకు తోమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఏడు సంవత్సరాల బాబు ఉన్నాడు. అయితే మంగళవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో భార్యాభర్తల మధ్య వివాదం చెలరేగడంతో కీర్తన అప్పారావును క్షణికావేశంతో స్క్రూ డ్రైవర్ తో మెడపై పొడవటంతో మృతి చెందాడు. దీనిపై బంటుమిల్లి పోలీసులకు సమాచారం అందగా సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మచిలీపట్నం క్లూస్ టీం ద్వారా వివరాలు సేకరించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## నల్లమలలో 154 ఏళ్ల తర్వాత అడవి దున్న

**ఆత్మకూరు, మహానాడు :**
నంద్యాల జిల్లాలోని ఆత్మకూరు డివిజన్ పరిధిలోని బైర్లూటి రేంజ్‌లో అడవి దున్న కెమెరా ట్రాప్లో కనిపించింది. 1870 తర్వాత అడవి దున్న ఇక్కడ



కనిపించడంతో ఫారెస్ట్ సిబ్బంది సైతం ఆశ్చర్య పోతున్నారు. వెలుగోడు రేంజ్ లో ఈ ఏడాది జనవరిలో మొదటిసారి అడవిదున్నను గుర్తించామని.. అదే అక్కడికి వెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ దున్న కర్ణాటక వైపు నుంచి కృష్ణానదిని దాటి నల్లమలలోకి ప్రవేశించి ఉంటుందని భావిస్తున్నారు.

## 18 వేల టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

**కాకినాడ, మహానాడు :**
కాకినాడ పరిసర ప్రాంతాల్లో రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ బృందాలు పలు గోదాముల్లో తనిఖీలు చేపట్టారు. రెండు గోదాముల్లో రూ.52.39 కోట్ల విలువైన 18,526 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. లోటస్ మెరైన్ లాజిస్టిక్స్‌లో రూ.25.18 కోట్ల విలువైన 8,280 టన్నులు, కాంక్వైర్ గోదాములో రూ.28.21 కోట్ల విలువైన 9,246 టన్నుల బియ్యం స్వాదీనం చేసుకున్నారు. సోమవారంవరకు స్వాధీనం చేసుకున్న రూ.43.43 కోట్ల విలు వైన 15,396 టన్నుల రేషన్ బియ్యానికి ఈ సరుకు అదనంగా గుర్తించారు.



జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | గురువారం 04, జులై 2024



## విక్టరీ వెంకటేష్, అనిల్ రావిపూడి కాంబో ప్రారంభం

విక్టరీ వెంకటేష్, బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి వారి కాంబినేషన్లో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ప్రొడక్షన్ నెం. 58 కోసం హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్లను పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నారు. రెండు హిలేరియస్ హిట్‌ల- ఎఫ్2, ఎఫ్3 తర్వాత వారు ఒక ఇంట్రస్టింగ్ ప్రాజెక్ట్ కోసం మరోసారి చేతులు కలిపారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఈ చిత్రం ఈ రోజు హైదరాబాద్‌లో అత్యంత గ్రాండ్‌గా ప్రారంభమైంది. ముహూర్తం షాట్‌కు సురేష్ ప్రొడక్షన్స్ నిర్మాత సురేష్ బాబు కెమెరా స్విచాన్ చేయగా, గీతా ఆర్ట్స్ నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. దర్శకుడు వంశీ పైడిపల్లి స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందజేశారు. లెజెండరీ డైరెక్టర్ రాఘవేంద్రరావు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ న్యూ మూవీ హీరో, అతని ఎక్స్ గర్ల్ ఫ్రెండ్, అతని ఎక్స్ లెంట్ వైఫ్.. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే ఎక్స్ ట్రార్డినరీ ట్రైయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ ముగ్గురూ ఇప్పటికే రెండు బ్లాక్‌బస్టర్‌లను అందించిన నేపథ్యంలో, వారి కాంబినేషన్‌లో మరో చిత్రం కోసం సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## సరైన సమయంలో సహాయం చేసేవాడు దేవుడు

నా పుట్టినరోజు సందర్భంగా రామ్ చరణ్ అన్న ఇంటికి పిలిచినపుడు వారికి నా మీదున్న ప్రేమకి చాలా సంతోషపడ్డా. అక్కడికి వెళ్ళాక మెగాస్టార్ చిరజీవి గారి ఆశీర్వాదం తో పాటు చరణ్ అన్న ఉపాసన కొణిదెల వదిన నాకు ఇచ్చిన మాటకి నా సంతోషం 1000 రెట్లు పెరిగింది. నేను ఇదివరకు అడిగిన సహాయాన్ని గుర్తుంచుకుని మా డ్యాన్సర్స్ యునియన్ టి. ఎఫ్. టి. టి. డి. ఎ లో 500ం కుటుంబాలకి హెల్త్ ఇన్స్యూరెన్స్ అందేలా వారు అండగా నిలబడతామన్నారు. అడిగిన సహాయాన్ని గుర్తుంచుకుని, ఇచ్చిన మాటకి విలువనిస్తూ, అన్ని కుటుంబాలని చేరదీయడం మామూలు విషయం కాదు. మా అందరి మనసులో కృతజ్ఞత భావం ఎల్లకాలం ఉంటుంది.






## "చిట్టి పొట్టి" గ్లిమ్స్‌కు అనూహ్య స్పందన

భాస్కర గ్రూప్ ఆఫ్ మీడియా బ్యానర్ పై భాస్కర్ యాదవ్ దాసరి దర్శకత్వం వహిస్తూ నిర్మించిన చిత్రం చిట్టి పొట్టి. రామ్ మిట్టకంటి, పవిత్ర, కస్వి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అన్న చెల్లెలి అనుబంధంతో నడిచే ఈ సినిమాలో భావోద్వేగాలు, తెలుగుదనం అనురాగాలు, ఆప్యాయతలు ఉంటాయి. మూడు తరాలలో చెల్లెలుగా, మేనత్తలుగా, బామ్మ గా ... ఒక అడబిడ్డకి పుట్టింటి పైన ఉన్న ప్రేమ, మమకారం ను తెలిపే చిత్రం. ప్రతి ఇంట్లో ఉండే ఆడపిల్ల విలువ తెలియజేసే సినిమా ఇది. చిట్టి పొట్టి టైటిల్ , మరియు మోషన్ పోస్టర్ కు చక్కటి ఆదరణ లభించింది, అలాగే ఇటీవల విడుదల చేసిన ఈ చిత్ర గ్లిమ్స్ కు విశేష ఆదరణ లభిస్తోంది. సోషల్ మీడియాలో గ్లిమ్స్ లోని డైలాగ్స్ వైరల్ అవ్వడం విశేషం. ఫ్యామిలీ ఎమోషన్స్ తో కూడిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుందని దర్శక నిర్మాత భాస్కర్ యాదవ్ దాసరి తెలిపారు.

## ఫిబ్రవరి 14న 'లైలా' మెస్మరైజింగ్ ఐ లుక్

ఇది నిజంగా సర్ ప్రైజింగ్, డేరింగ్ స్టెప్. ఈ జనరేషన్ హీరోలెవరూ లేడీ క్యారెక్టర్ చేయడానికి సాహసం చేయరు. అయితే, డిఫరెంట్ జానర్‌ల చిత్రాలను చేస్తున్న మాస్ కా దాస్ విశ్వక్సేన్, షైన్ స్క్రీన్స్ సాహు గారపాటి నిర్మిస్తున్న తన




లేటెస్ట్ మూవీ 'లైలా'లో మ్యాన్ అండ్ విమన్ గా కనిపించనున్నారు. రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రానికి రామ్ నారాయణ్ దర్శకుడు. విశ్వక్సేన్‌ను లైలాగా మునుపెన్నడూ లేని క్యారెక్టర్ లో ప్రజెంట్ చేయడానికి పవర్ ఫుల్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు. బ్రేవ్ అండ్ టఫ్ క్యారెక్టర్ ని అంగీకరించడం మెంటల్ గా ఫిజికల్ గా ఛాలెంజ్ తో కూడుకున్నది. మేకర్స్ లైలా ఐ లుక్‌ని రిలీజ్ చేశారు. విశ్వక్ సేన్ లైలాగా ఛార్మింగ్ లుక్ తో అదరగొట్టారు. విశ్వక్సేన్‌కి ఇది బ్యూటీఫుల్ మేక్ఓవర్. అతను పర్ఫెక్ట్ గా విమన్ లా కనిపించిన లుక్ అద్భుతంగా ఉంది. ఫిమేల్ గెటప్‌లో విశ్వక్‌లా మరే యాక్టర్ కనిపించి ఉండరనడంలో సందేహం లేదు. ఆ పాత్రకు ఆయన ఎంత అద్భుతంగా సూట్ అయ్యాడో ఆ కళ్లను చూస్తేనే అర్థమవుతుంది. లైలాగా విశ్వక్సేన్ కంప్లీట్ ఫేస్ ని చూసేందుకు ఎక్సయిమెంట్ మరింతగా పెంచింది. ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ఈరోజు గ్రాండ్ గా లాంచ్ అయ్యింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు కె. రాఘవేంద్రరావు క్లాప్ ఇవ్వగా, దర్శకుడు హరీష్ శంకర్ కెమెరా స్విచాన్ చేశారు.



## ఆగస్టు 2న "ఆపరేషన్ రావణ్"

రక్షిత్ అట్లూరి హీరోగా రాధికా శరత్ కుమార్ ముఖ్య పాత్రలో నటిస్తున్న కొత్త సినిమా "ఆపరేషన్ రావణ్". ఈ చిత్రాన్ని ధ్యాన్ అట్లూరి నిర్మాణంలో న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్ గా దర్శకుడు వెంకట సత్య తెలుగు మరియు తమిళ బాషల్లో రూపొందిస్తున్నారు. సంగీర్తన విపిన్ హీరోయిన్‌గా నటిస్తోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న "ఆపరేషన్ రావణ్" సినిమా రిలీజ్ డేట్ ను ఈరోజు మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నట్లు వారు వెల్లడించారు. "ఆపరేషన్ రావణ్" రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌పై ఓ సైకో స్టోరీ అనే క్యాప్షన్ పెట్టారు. యాక్షన్ సీక్వెన్సులోని హీరో రక్షిత్ అట్లూరి స్టిల్‌తో డిజైన్ చేసిన ఈ పోస్టర్ ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తోంది.

"ఆపరేషన్ రావణ్" సినిమాలో రాధికా శరత్ కుమార్, చరణ్ రాజ్, తమిళ నటుడు విద్యాసాగర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తు న్నారు. ఈ సినిమా విజయంపై మూవీ టీమ్ కాన్ఫిడెంట్‌గా ఉన్నారు.



## భయపెట్టబోతున్న అప్సరా రాణి.. 'రాచరికం'

అప్సరా రాణి, విజయ్ శంకర్, వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రల్లో గతంలో ఎన్నడూ చూడని కథతో 'రాచరికం' అనే మూవీ రాబోతోంది. ఈశ్వర్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాను చిల్ బ్రోస్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి సురేష్ లంకలపల్లి కథ, కథనాన్ని అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ సినిమాకు సంబంధించి పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా సాగుతున్నాయి. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా పర్ఫెక్ట్ అవుట్ పుట్ తీసుకొస్తున్నారు మేకర్స్. రీసెంట్‌గా రాచరికం మూవీ నుంచి హీరోయిన్ అప్సరా రాణి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేయగా ప్రేక్షకుల నుంచి భారీ రెస్పాన్స్ వచ్చింది. కాళీ మాత ఉగ్ర రూపం దాల్చితే, రక్తంతో ఒళ్లంతా తడిసి ముద్దైతే ఎలా ఉంటుందో.. ఈ పోస్టర్‌లో అప్సరా రాణి అలా కనిపించారు. ఈ పోస్టర్ చూస్తుంటే అప్సరా రాణికి అద్భుతమైన పాత్ర లభించినట్టుగా కనిపిస్తోంది. థ్రిల్లింగ్ కాన్సెప్ట్, డిఫరెంట్ కంటెంట్, సగటు ప్రేక్షకుడిని కట్టిపడేసే సన్నివేశాలతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు సారథి స్టూడియోస్‌లో శరవేగంగా జరుగుతున్నాయి.

చివరిదశ పనుల్లో ఉన్న ఈ సినిమాపై జనాల్లో అంచనాలు క్రియేట్ అయ్యాయి.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144